శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

కాపు భవన్ ఆధునీకరణకు
మరో కోటి రూపాయల సొంత నిధులు

- కలెక్టర్‌కి కోటి రూపాయల చెక్కును అందించిన మంత్రి అల్లుడు పునీత్
- జూలై నాటికి కాపు భవన్ సిద్ధం
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కీలక ప్రకటన

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 24, ప్రభాతవార్త కాపులకిచ్చిన మాటను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు మంత్రి నారాయణ నిలబెట్టుకున్నారు. కాపు భవన్ ఆధునీకరణకు కోటి రూపాయల విరాళం ఇచ్చారు. చెక్కును మంత్రి అల్లుడు పునీత్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు అందచేశారు. రెండు విడతల్లో రెండు కోట్లు ఇచ్చిన మంత్రికి కాపు భవన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్న మంత్రి నారాయణ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. కాపు భవన్ ఆధునీకరణ కోసం ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధుల నుండి రెండవ విడతగా రూ. 1 కోటి విరాళాన్ని ప్రకటించారు. మంగళవారం మంత్రి అల్లుడు పునీత్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను కలిసి కోటి రూపాయల చెక్కును అందజేశారు. గతంలోనే కాపు భవన్ అభివృద్ధి కోసం కోటి రూపాయల సొంత నిధులు ఇచ్చిన మంత్రి, ఇప్పుడు మళ్ళీ కోటి రూపాయలు కేటాయించడంపై కాపులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ మంత్రి నారాయణ అందించిన ఈ నిధులతో వచ్చే జులై నాటికే కాపు భవన్ ఆధునీకరణ పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. తమ అభ్యర్థనను మన్నించి, ఇచ్చిన మాట ప్రకారం మొత్తం రూ. 2 కోట్లు కేటాయించినందుకు కాపు భవన్ కమిటీ సభ్యులు మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కలెక్టర్ హిమాన్షు శుక్ల, మంత్రి అల్లుడు పునీత్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపు భవన్ నాయకులు గాదిరాజు అశోక్, పోతరాజు శ్రీనివాస్, అనిల్ కుమార్, గునుకుల కిషోర్, భూపతి విజయ కుమార్, పసుపర్తి కిషోర్ కుమార్, శంఖవరపు శ్రీహరి, సూరిశెట్టి గాయత్రి, వనమాల గోవింద రావు, పులి శ్రీనివాసులు, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి, ఉస్మాన్ సాహెబ్ పేట రామాలయ ఛైర్మెన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఆత్మీయ స్వాగతం పలికిన మంత్రి ఆనం

నెల్లూరు, మార్చి 24, ప్రభాతవార్త–విద్య : నెల్లూరు నగరానికి వచ్చిన రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, ఎన్ఎండి ఫరూక్, మాజీ మంత్రి , తెలుగుదేశం పార్టీ నాయకులు మోపిదేవీ వెంకటరమణలకురాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పుష్పగుచ్చాలు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఓ సమావేశంలోనిపాల్గొనేందుకు నెల్లూరుకివిచ్చేసిన మంత్రులను నగరంలోని స్థానిక ఆర్‌అండ్‌డి అతిథి గృహంలో మంత్రి ఆనం కలిసి మాట్లాడారు. అనంతరం స్థానిక నాయకులతో ఆయన మాట్లాడారు.

గిరిజనుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయం

- పైనాపురంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, మార్చి 24, ప్రభాతవార్త కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి గ్రామంలో అభివృద్ధి జోరందుకుందని, గిరిజనుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పైనాపురంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరదిబ్బ గిరిజన కాలనీ వాసులు అత్యంత దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని రూ. 15 లక్షలతో తాగు నీటి సంపు నిర్మాణం, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, చిన్న సంఘం గిరిజన కాలనీలో రూ. 10.50 లక్షలతో ఆర్వో ప్లాంటు, డ్రైనేజీ కాలువపై శ్లాబు నిర్మాణం, వాగర్త కాలనీలో రూ. 12.70 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, దిబ్బమీద ఎస్సి కాలనీలో రూ. 14 లక్షలతో ఇంటింటికి తాగునీటి కుళాయి, పైపు లైన్లు ఎక్స్ టెన్షన్, రూ. 30 లక్షలతో పంచాయితీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన ప్రారంభించామన్నారు. అలాగే ఎస్ఈఐఎల్ కంపెనీ సిఎస్ఆర్ నిదులు రూ. 66 లక్షలతో నిర్మించిన రెండు మెగా వాటర్ ప్లాంట్లను ప్రారంభించామన్నారు. అలాగే రూ. 52 లక్షలతో 210 సోలార్ లైట్లు ఎస్ఈఐఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసామన్నారు. గిరిజనుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఎస్ఈఐఎల్ ఏర్పాటు చేసిన వ్యానులో గిరిజన బిడ్డలు స్కూలుకు వెళుతుండటం సంతోషంగా ఉందన్నారు. మనతో సమానంగా భూమిపై అడుగుపెట్టిన గిరిజనులు ఇంకా పేదరికంతో దుర్భర పరిస్థితిలో ఉండటం బాధాకరమన్నారు. నా వంతుగా నేను వారి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నానన్నారు. ఎస్ఈఐఎల్‌తో పాటు పామాయిల్ కంపెనీలను కోరి గిరిజన కాలనీలను దత్తత తీసుకునేలా కృషి చేశానన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పైనాపురం, వరకవిపూడి, ముసునూరువారిపాళెం పంచాయతీల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎస్ఈఐఎల్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం నేలటూరు ప్రధాన గ్రామానికి సంబంధించిన ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరుకుందని, నేలటూరుపాళెంకు సంబంధించి ఇంకా పునాదుల స్థాయిలోనే ఉందని తెలిపారు. ఎస్సీ కాలనీతో పాటు దేవరదిబ్బ గిరిజన కాలనీలకు సంబంధించి స్థల సేకరణ జరపాల్సి వుందన్నారు. మా ప్రభుత్వ హయాంలోనే ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, మునుకురు రవికుమార్ రెడ్డి, పైనాపురం సర్పంచ్ విజయ్, పిడతాపోలూరు టిడిపి నాయకులు దండు శ్రీనివాసులు, శోభన్, రమేషు ఉడతా ఈశ్వరయ్య, సురేష్, వివిధ గ్రామాల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ అజీజ్‌ను పరామర్శించిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

నెల్లూరు, మార్చి 24, ప్రభాతవార్త –వైద్యం ఇటీవల కాలంలో మాతృ వియోగం చెందిన ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను నగరంలోని హరనాథపురం లో గల ఆయన నివాసంలో మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు నిలవల విజయశ్రీ, కొండబాబు, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య తదితరులు పరామర్శించారు.

అభివృద్ధి,సంక్షేమానికి నిర్వచనం కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



బుచ్చి మార్చి 24 ప్రభాతవార్త అబివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడలో సిసిరోడ్డు,డ్రైనేజి నిర్మాణం పనులు ప్రారంభించిన సందర్బంగా ఆమె మాట్లాడుతు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలన్ని సూపర్ హిట్ అయ్యాయయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో పరిపాలన దక్షత కల్గిన నాయకుడు అని ఆమె కొనియాడారు. మహిళలకు ఉచిత బస్సులు, పెన్షన్ 4 వేలు చెప్పినవి చెప్పినట్లు చేసుకుంటు ముందుకు వెళుతున్నారని ఆమె పేర్కున్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కిసాన్ సెజ్‌లో అనేక పరిశ్రమలను తీసుకొని వస్తున్నామని అన్నారు.వైసిపి హయాంలో వ్యవస్థలన్ని అస్తవ్యస్తమై పోయాయని విమర్శించారు. నాయకులంతా ఐకమత్యంగా ఉంటే ఆ గ్రామం అబివృద్ధి చెందుతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎంతో పారదర్శకంగా వ్యవహరించి రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయడం జరిగిందని అన్నారు. భూములు రీ సర్వేలో ఎవ్వరికైనా ఇబ్బంది జరిగితా నావద్దకు రండి వెంటనే పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. జొన్నవాడ నాయకులు ఎమ్మెల్యేని గజమాలలతో సత్కరించారు.ఈకార్యక్రమంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ రంతులయ్య, బుచ్చి రూరల్ బ్యాంకు ఛైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యాక్షులు మన్నెపల్లి శ్రీనివాసులు ,సర్పంచ్ కందికట్టు పెంచలయ్య, గ్రామ కార్యదర్శి మేరి పోలీనా, నీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణా, ట్రాన్స్‌కో ఏడి సతీష్, బుచ్చి టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, జొన్నవాడ దేవస్థానం ఛైర్మన్ అశోక్‌రెడ్డి, ఆలయ ఇఓ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ఉమయ్యస్వామి,ట్రస్టు బోర్డు మెంబర్ సుధాకర్,పురిణి హరినాద్‌రెడ్డి,పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీలో పరిపాలన అధికారిపై సస్పెన్షన్ వేటు

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 24, ప్రభాతవార్త నూతన జిల్లా పరిషత్ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్న పరిపాలిన అధికారి వర్మాను జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రెడ్డి బుధవారం విధులు నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పలు శిక్షణ కార్యక్రమాల, మీటింగ్లో నిధులు, దుర్వినియోగం చేస్తూ తప్పుడు బిల్లులు సృష్టించి అవకతవకలు చేసినందుకుగాను ఈయనపై వేటు, వేస్తూ జెడ్పి సీఈవో శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మత్స్యకారుల పక్షమే

- రాష్ట్ర ఎక్సైజ్ గనులుశాఖ మంత్రి కొల్లు రవీంద్ర

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 24, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మత్స్యకారుల పక్షమేనని, వారు ఏ నిర్ణయం తీసుకున్నా ప్రభుత్వం పూర్తిగా వారికి అండగా నిలుస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ గనులుశాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సముద్రంలో చేపలవేటకు అక్రమబోట్ల ప్రవేశం పూర్తిగా నివారించడం, జువ్వలదిన్నె మత్స్యకారుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన కమిటీ సభ్యులు మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, ఎన్ఎండి ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కల్యాణ్ చక్రవర్తి, రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, నెలవల విజయ శ్రీ, పాశం సునీల్ కుమార్, ఐజి సర్వశ్రేష్ట త్రిపాటి, ఎస్పీ డా.అజితా వెజండ్ల, ఫిషరీస్ కమిషనర్ రాములు నాయక్ హాజరయ్యారు. మన తీరంలో చేపలవేటకు అక్రమంగా తమిళనాడు, పాండిచ్చేరి బోట్ల ప్రవేశాన్ని పూర్తిగా అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మత్స్యకారుల భద్రత, భరోసా మొదలైన అంశాలపై కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన పలు అంశాలను ప్రజాప్రతినిధులు కమిటీ సభ్యులు, మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

రాష్ట్ర ఎక్సైజ్ గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాత్రికేయులతో మాట్లాడుతూ

ఇటీవల జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో 8 నెలలుగా మత్స్యకారుల ఆధీనంలో వున్న పాండిచ్చేరికి చెందిన నాలుగు బోట్లను గుర్తుతెలియని వారు తీసుకెళ్లారని, దీంతో మత్స్యకారులు ఆవేదనతో వున్నట్లు చెప్పారు. ఈ విషయమై తీర ప్రాంతాల్లోని మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులు ఆందోళనతో ఉన్నట్లు చెప్పారు. గత 20 సంవత్సరాలుగా తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఈ బోట్ల సమస్య వుందని చెప్పారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే తమిళనాడు బోట్ల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందులో భాగంగా టాస్క్ ఫోర్స్ బృందంతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ తీరంలో మెకనైజ్డ్ బోటుతో గస్తీని ముమ్మరం చేసినట్లు చెప్పారు. వేట నిషేధ సమయం పూర్తయ్యేలోగా మరో రెండు బోట్లను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో 27 మెరైన్ స్టేషన్ల పరిధిలో 18 బోట్లు రిపేర్లకు గురై వున్నాయని, సీఎంతో చర్చించి వీటికి రిపేర్లు చేయించడమా, లేదా కొత్తవి కొనుగోలు చేయడంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సూచించిన మేరకు గస్తీని ముమ్మరం చేయడం, నూతన బోట్లు ఏర్పాటు చేయడం, మెరైన్, కోస్టల్ గార్డ్ వ్యవస్థను పటిష్టం చేయడం మొదలైన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను మత్స్యకారులకు సంపూర్ణంగా అందించి వారి జీవనప్రమాణాలు మెరుగు పరుస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం తరపున ఒక్కొక్క మత్స్యకారునికి 20 వేలు చొప్పున 1.20 లక్షల మందికి సాయం అందించామని, 50 ఏళ్ల వయస్సున్న వారికి పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. రాయితీపై మెకనైజ్డ్ బోట్లను ఇప్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు.ప్రస్తుతం మత్స్యకార గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం తరపున చర్చలకు ఆహ్వానిస్తున్నామని, లేదా వారు ఏ నిర్ణయం తీసుకున్నా ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కొంతమంది కావాలని మత్స్యకారులను రెచ్చగొడుతూ గొడవలు సృష్టించాలని చూస్తున్నారని, తమ ప్రభుత్వానికి మొదటి నుంచి కూడా మత్స్యకారులు అండగా నిలుస్తున్నారని, వారి సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు దీక్ష, సౌజన్య, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి, ఏడి చాంద్ బాషా, డీఎస్పీలు, మెరైన్ పోలీసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం రాష్ట్రానికి గర్వకారణం

కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 24 ప్రభాతవార్త : అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్, నిస్సాన్‌స్టీల్ సంయుక్తంగా ఏర్పాటుచేస్తున్న భారీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం రాష్ట్రానికి గర్వకారణమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారస్వామి, సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల చేతుల మీదుగా ఈ ప్రాజెక్టు ప్రారంభం కావడం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైలురాయి అని తెలిపారు. సుమారు రూ.1.35,964కోట్లు భారీ పెట్టుబడితో నిర్మించేనున్న ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. 5465 ఎకరాల్లో రెండు దశల్లో అమలు చేయనున్న ఈ ప్లాంట్ లక్షకుపైగా ఉద్యోగాలు కల్పించబడుతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కేవలం ఉక్కు తయారీకి పరిమితం కాకుండా స్కిల్ డెవలప్‌మెంటు టెక్నికల్ ట్రైనింగ్ అనుబంధ పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి, అవకాశాలు కల్పించనున్నదని వివరించారు. ఈ ప్రాజెక్టు వెనుక ప్రధాన శక్తిగా మంత్రి నారాలోకేష్ కృషి ఉందన్నారు.ఈ ప్లాంట్‌తో పాటు 50 ఎంటిపీఏ సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్టును 11,192కోట్లతో 316ఎకరాల్లో నిర్మించనున్నారని దీని ద్వారా సుమారు 6వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ఈ పరిశ్రమ ఏర్పాటుపై పిఎం నరేంద్రమోదీ కూడా హర్షం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేయడం రాష్ట్రానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు రాష్ట్ర యువత భవిష్యత్తును మార్చే ఉపాధి యంత్రంగా నిలవబోతుందని తెలిపారు.

ఎన్నో ఏళ్ల కల కాకర్లతో నిజమైన వేళ

గంగిరెడ్డిపాళెం ప్రజల ఆనంద హేల

కలిగిరి, మార్చి24, ప్రభాతవార్త ఎన్నో ఏళ్లకల, ఎన్నోరోజలుపాటు ఎదురు చూసిన వేళ.అసలు ఆకార్యం నెరవేరుతుందా అనే అనుమానం.రెండుతరాలు ఆశల పల్లకి ఆగ్రామ వంతెన నిర్మాణం.ఎదురు చూసిన రోజులెన్నో ఓట్లుకోసం నాయకులు ఊతపదంలా వాడుకున్న వంతెన నిర్మాణం.రోజులు గడిచాయి. కాలాలు మారాయి. కార్యం మాత్రం జరగలే. ఎదురుచూసిచూసి కన్నులు కాయలు కాశాయి. వానల్లో వరదలో ఆగ్రామం పడిన వేదన. ఎందరో చంటి బిడ్డలతో వరదలలో దాటలేక గడపిన జోజులెన్నో. పాలకులు అబద్దాల ఓట్లుపై నిస్సహాయ స్తితిలో గడిపిన రోజులెన్నో అలాంటి ఎదరుచూసిన రోజులు కాలాలు గిర్రున నెమరు వేసుకున్న రోజు ఈరోజు. అదే క్రమంలో 2024లో జరిగిన ఎన్నికల్లో ఆగ్రామాల ప్రజలు ఓట్లుకోసం వచ్చిన నాయకులను తమ బాధలు చెప్పుకున్న ప్రజలు. అందరిలాగానే ఆయన కూడా నన్ను గెలిపించండి మీసమస్య తీరుస్తానంటూ ఇరుపార్టీల నాయకులు వాగ్దానాలుచేశారు. ప్రజలు మాత్రం తెలిగ్గానే తీసుకున్నారు. ఆఎన్నికల్లో ఉదయగిరికి యంఎల్ఏగాయన్నారై కాకర్ల సురేష్ గెలుపొందారు. అనంతరం ఒకసందరబంలోకురిసి బారీవర్షాలకు వాగులు విపరీతంగా రావడం రెండు గ్రామాల ప్రజలు యంఎల్ఏను స్వయంగా తమ గ్రామాలకు ఆహ్వానించడంతో ఆ వరద దృశ్యం చూసిన యంఎల్ఏ కాకర్ల సురేష్ మనస్సు చెలించి పోయింది. ఆవరద దృశ్యంచూసిన యంఎల్ఏ మీ గ్రామాలు ఇక ఇబ్బందులు లేకుండా చేస్తానని మాట ఇచ్చారు. వంతెన నిర్మాణానికి అధికారులతో ఎష్టిమేషన్ వేయించివంతెననిర్మాణానికి అనుమతులు తీసుకువచ్చారు. అంతేగాక వెనువెంటనే పనులు పూర్తిచేయించి మంగళవారం మద్యాహం 11గంటల సమయంలో వంతెన ప్రారంబోత్సవం గావించారు. యంఎల్ఏ స్తాయికి ఇది చిన్న విషయమేకావచ్చు. కానీ ఇది కొన్ని సంవత్సరాల నిరీక్షణ.ఎందరో ప్రజలు ఎన్నోఏళ్ల కన్నకలు. నిజంగా ఈనాటికి వంతెన నిర్మాణం నిజమై కాకర్ల సురేష్ చేతులు మీదగా ప్రారంబోత్సవం కావించడం ఆ ప్రాంత ప్రజలాశయానికి నిదర్శనం.కలిగిరి మండలంలోనిగంగిరెడ్డిపాళెం, బట్టువారిపాళెం,మార్తుల వారిపాళెం అను మూడు గ్రామాలు కలిసి ఇక బట్టువారిపాళెం పంచాయితీగా ఏర్పడ్డాయి.ఇందులోమార్తులవారిపాళెం తప్ప, గంగిరెడ్డిపాళెం,బట్టువారిపాళెం గ్రామాల మద్యన ఒక వాగు తరాలక్రితం నుండి పారుతుంది.గంఇరెడ్డిపాళెం ప్రజలు ఈదారినే పగలైనా, రాత్రైనా నడవాలి. వానలైనా,ఎండలైపా ఇదారినే నడవాలి. వాగులు వచ్చిన సమయంలో ఈరెండు గ్రామాల మద్య రాకపోకలు బంద్. ఈసమయంలో ఏప్రమాదంజరిగినా గ్రామంలోనే ఉండాలి. ఇది చూసి చెలించి ఈరెండు గ్రామాల ప్రజలకు ఇంతమంచి పనిచేసిన ఉదయగిరి శాసన సబ్యులుకాకర్ల సురేష్‌కు ఈగ్రామాల ప్రజలు జన్మతహా: రుణపడి ఉంటారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ పరిశీలన

వింజమూరు, మార్చి 24, ప్రభాతవార్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏప్రిల్ 1వ తేదీన వింజమూరు పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఎస్పీ అజిత వేజెండ్ల సీఎం పర్యటన ఫ్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ కే.రాఘవేంద్రన్, జడ్పీ సీఈఓ ఎల్.శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ గంగా భవాని, డీపీవో వసుమతి, కావలి డీఎస్పీ శ్రీధర్, ఎస్బీడీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ హరిబాబు, ఆత్మకూరు ఆర్డీవో పావని, కావలి ఆర్డీవో ఎలీషా, కలిగిరి సీఐ వెంకట నారాయణ, ఉదయగిరి సీఐ వెంకట్రావు వింజమూరులో పర్యటించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సీఎం ప్రయాణించే హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. భద్రతా ప్రమాణాల దృష్ట్యా హెలిప్యాడ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం సభా వేదిక పరిశీలన చేశారు. ముఖ్యమంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే బహిరంగ సభా వేదిక నిర్మాణ పనులను ఆమె అడిగి తెలుసుకున్నారు. వేదిక పటిష్టత, వీవీఐపీ గ్యాలరీ, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేలా భారికేడ్ల ఏర్పాటుపై సమీక్షించారు. సీఎం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ స్థలాలు, రూట్ మ్యాప్‌పై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు ఎస్సై వీర ప్రతాప్, కలిగిరి ఎస్సై ఉమా శంకర్, ఎంపీడీవో కే.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు, తహసీల్దార్ ఎస్‌కే హమీద్, డిప్యూటీ తహసీల్దార్ ఓబయ్య, పంచాయతీ రాజ్ ఇరిగేషన్ అధికారులు, పోలీసు రెవెన్యూ సిబ్బంది పాల్గొని ఏర్పాట్ల పురోగతిని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సా రెడ్డి, సొసైటీ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి, సొసైటీ డైరెక్టర్ కోదూరు నాగిరెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ షేక్ రఫీ, చల్లా శ్రీనివాస్ యాదవ్, కేఎస్ నాయుడు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యానికి పూర్తి కొనుగోలు

- పారదర్శకతకు ప్రాధాన్యం: కలెక్టర్ హిమాన్షు శుక్ల

తోటపల్లి గూడూరు, మార్చి 24, ప్రభాతవార్త మండలంలోని వరిగొండలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, గిట్టుబాటు ధర అందేలా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులు, నమోదు ప్రక్రియ, ధాన్యం స్వీకరణ విధానం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సిబ్బందిని కొనుగోలు విధానం, రైతులకు అందిస్తున్న సదుపాయాలు, చెల్లింపులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో సాగైన వరి పంట విస్తీర్ణం, పండించిన వంగడాలు, సేకరించిన ధాన్యం పరిమాణం, మిగిలిన లక్ష్యాలపై సమగ్రంగా విచారణ చేపట్టారు. రాబోయే రోజుల్లో ధాన్యం రాక పెరిగే అవకాశం ఉన్నందున ఎలాంటి అంతరాయం లేకుండా కొనుగోలు కొనసాగించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోనె సంచుల సరఫరా నిరంతరం ఉండేలా చూసుకోవడం, రవాణాకు తగిన వాహనాలను సిద్ధంగా ఉంచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కనీసం వారం ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. తేమ శాతం కొలిచే యంత్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ధాన్యం నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని సూచించారు. కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడి, గిట్టుబాటు ధర, చెల్లింపుల సమస్యలపై ఆరా తీశారు. రోడ్డుపై నిలిపి ఉంచిన ధాన్యంతో కూడిన ట్రాక్టర్లను పరిశీలించి, నమోదు విధానం, ట్రాకింగ్ వ్యవస్థపై దృష్టి సారించారు. రైతుల ధాన్యం ఆలస్యం కాకుండా వేగంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. అనంతరం సమీప రైస్ మిల్లును సందర్శించి, ధాన్యం స్వీకరణ నుండి ప్రాసెసింగ్ వరకు జరిగే మొత్తం ప్రక్రియను సమీక్షించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి రైతుల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డీఎం అర్జున్ రావు, జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప, తహసీల్దార్ సుధీర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

సాంప్రదాయాల పరిరక్షణలో ఆలయాల పాత్ర కీలకం : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

విడవలూరు, మార్చి 24, ప్రభాతవార్త : మండలం గాదెలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాల ఆవిష్కరణతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా నిర్వహించిన హోమాలు, పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికత ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆలయాలు హైందవ సంస్కృతికి ప్రతీకలని, భవిష్యత్ తరాలకు సాంప్రదాయాలను అందించడంలో వాటి పాత్ర కీలకమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్టన్ ఛానల్ డిస్ట్రిబ్యూట్ కమిటీ ఛైర్మన్ పాశం శ్రీహరి

రెడ్డి, జడ్పిటిసి సభ్యులు తుమ్మల లక్ష్మయ్య, వెల్లంపల్లి దిలీప్ కుమార్, బెజవాద గోవర్ధన్ రెడ్డి, చౌకచర్ల మాజీ సర్పంచ్ సమాధి శ్రీనివాసులు, కొరిమెర్ల వెంకటేశ్వర్లు, శేషయ్య, సర్పంచ్ వెంకటేశ్వర్లు, స్థానిక కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిణి చే ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీ

బిట్రగుంట మార్చి 24 ప్రభాతవార్త : బోగోలు మండలంలో మంగళవారం మండల ప్రత్యేక అధి కారిని(కావలి పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) సుమన పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు దళారుల ప్రమేయం లేకుండా గిట్టుబాటు ధర లభించేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది పెట్టకుండా ధాన్యం రాగానే ట్రాక్టర్ షీట్లు తీసి మిల్లర్లుకు వెంటనే పంపించి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. అదేవిదంగా మిల్లర్లు కూడా లారీల ద్వారా వచ్చిన ధాన్యం ను వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు.రైస్ మిలర్లకు బ్యాంకు గ్యారంటీ లలో ఇబ్బం దులు ఉంటే తెలియజేయాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, కావలి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ విజయమ్మ ఉన్నారు.

కృష్ణపట్నం సీఐ రఘుబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీఎస్టీ పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షులు చిన్న

తోటపల్లి గూడూరు, మార్చి 24, ప్రభాతవార్త: ముత్తుకూరు మండలం కృష్ణపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రఘుబాబును జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షులు తెలుమేటి చిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ, పోలీస్ శాఖ ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సామాజిక న్యాయం, శాంతి భద్రతల పరిరక్షణలో పరస్పర సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం

వింజమూరు, మార్చి 24, ప్రభాతవార్త : అంతర్జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక మాశిలామణి వైద్యశాల నందు క్షయ నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మర్రిపాడు మండల కృష్ణాపురం మాజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి హాజరయ్యారు. వైద్యాధికారి కే.మాశిలామణి రోగులను ఉద్దేశించి మాట్లాడుతూ క్షయ వ్యాధి గురించి పూర్వపు రోజులలో భయాందోళన చెందే వారిని అందుకు కారణం అప్పుడు సరైన మందులు లేకపోవడమే అన్నారు. ప్రస్తుతం పలు రకాలకు చెందిన క్షయ వ్యాధి మందులు అందుబాటులోకి వచ్చాయని ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. క్షయ వ్యాధి సోకినట్లయితే విపరీతమైన దగ్గు రావడం వల్ల గల్ల పడడం, వాంతులు, విరేచనాలు రావడం, శరీరం నీరసించి పోవడం ఆకలి లేకపోవడం అప్పుడప్పుడు జ్వరం రావడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి సోకిందని సందేహం కలిగిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో క్షయ వ్యాధి పరీక్షలను చేయించుకొని వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలన్నారు. నిర్ధారణ అయిన వెంటనే వైద్య ఆరోగ్య శాఖను సంప్రదించి అందుకు తగిన చికిత్సలు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం ద్వారా క్షయ వ్యాధికి కోర్సులు అందించే మందులను అందజేస్తుందన్నారు. క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన వైద్యులు సిఫార్సులు మేరకు మందులు వాడినట్లయితే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. ఈ వ్యాధి రావడానికి ఒకరి నుండి ఒకరికి సంక్రమిస్తుందని తెలిపారు. ఇతరులు దగ్గేటప్పుడు చేతిని గాని చేతి గుడ్డను గాని అడ్డుపెట్టుకుని తుమ్మాలన్నారు.ఈ వ్యాధి పట్ల తగు జాగ్రత్తలువహించి దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ ప్రశాంత్, వైద్యశాల చైర్మన్ నిర్మల, హాస్పిటల్ సీఈఓ హెప్సిబా, సిబ్బంది శాంతి, మల్లిఖార్జున, కీర్తన, తిరుమలేశు, శాలిని, సుజిత్, కీర్తి, ప్రేమలీల, విజయ్, జయరాజు ఉన్నారు.

చాపకింద నీరుల పారుతున్న డ్రగ్స్

కావలి, మార్చి 24 ప్రభాతవార్త : డ్రగ్స్, గంజాయి అంతానికై ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఐద్వా ప్రజానాట్య మండలి, జనవిజ్ఞాన వేదిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త జీపుజాత నెల్లూరు రూరల్ ప్రాంతంలో ఆర్టిడి కాలనీలో ప్రారంభమై మంగళ వారం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కావలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రచార జాతకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచార జీపు జాత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ మత్తుపదార్థాలను సేవించడం పట్ల విద్యార్థులు హత్యలకు పాల్పడుతున్నారని ప్రజల్లో ఎప్పటికప్పుడు భయాందోళనలు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం మూడు రోజులు పాటు ఈ జీపుజాత వెలుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిలాల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.మస్తాన్ బి.శివకుమారి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవి.రమణ, బిపి నరసింహ, వి.నరేంద్ర, టి.విక్రమ, పట్టణ కార్యదర్శి పెంచల నరసింహం, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పి.జానకిరామ్, పట్టణ అధ్యక్షలు తోట వెంకటేశ్వర్లు, యూటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు శ్రీదేవి, సిపిఎం పార్టీ నాయకులు పెంచలయ్య, వెంకయ్య, క్రిష్ణమోహన్, ఎస్ఎఫ్ఐ వేదిక, యూటిఎఫ్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

కోట, మార్చి 24 ప్రభాతవార్త : వేసవికాలం నేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ కోరారు. మంగళవారం కోట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో మండలంలోని అసిస్టెంట్ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులకు నీటి నాణ్యత టెస్టింగ్ ట్రైనింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ఉన్న మంచినీటి పథకాలు, చేతి పంపుల్లో నీటి నాణ్యత ఏ విధంగా ఉందో పరీక్షించాలని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ కోరారు. రికార్డుల నిర్వహణ చేసి ఎక్కడ ఎలాంటి కలుషితం లేకుండా పైపులైన్లు లీకేజిలు అరికట్టాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు సూచించారు. ఈ టెస్టింగ్ ఎలా చేయాలనే విధానంపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ అరవింద్ ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో డిఇ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాన్యం కొనుగోలుపై సమీక్షించిన ప్రత్యేకాదికారి

జలదంకి, మార్చి24, ప్రభాతవార్త: జలదంకిలో ధాన్యం కొనుగోలు, రైతుల పరిస్థితి తీసుకో వలసిన చర్యలు తదితరాలపై ప్రత్యేకా దికారి దాసరి శ్రీనివాసులు మంగళవారం సమీక్షిం చారు.స్థానిక సిఎంఆర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ప్రత్యేకాదికారి తహసి ల్దార్ సీతామ హాలక్ష్మి,ఇన్‌చార్జ్ ఎంపిడిఒ శ్రీధర్,వ్యవసాయాది కారిణి వాణిలతో సమావేశ మయ్యారు.ప్రస్తుతం మండలంలో రైతుల స్థితిగతులు,ఎంత దాన్యం రైతుల వద్ద నిల్వవుంది, ,మండలాని ఎన్ని మిల్లులు కేటాయిం చారు,గోతాలు అందుబాటులో వున్నాయా వంటి వాటిపై చర్చిం చారు.తీసుకోవాల్సి న చర్యలపై కూలంకుషంగ మాట్లాడారు.మండలంలోని మిల్లులు ఇతరమం డలాలలో కేటాయించిన మిల్లులు తదితరాలను గూర్చి అడిగి తెలుసుకున్న ప్రత్యేకాదికారి కొన్ని మార్గదర్శకాలను సూసించారు.కొనుగోలు కేంద్రంలో సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. తేమశాతం ఎంత, ఎలా నిర్ధారిస్తున్నారు అని అడిగితెలుసుకున్నారు.తదుపరి చర్యలు వేగవంతం చేసి రైతన్నలకు మేలు చేసే అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.అనంతరం సాయంత్రం వేళ ఎంపిడిఒ కార్యాలయ సమావేశపు హాలులోమిల్లర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.దాన్యం కొనుగోలుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలి



కోవూరు, మార్చి 24 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024 ఎలక్షన్‌లో తనను గెలిపిస్తే ప్రతి నిరుపేదకు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఇస్తానని ఊరూరా ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే లేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్. రమణయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి తప్పనిసరిగా ఇంటి స్థలంతో పాటు రూ. 5 లక్షలు నిర్మాణానికి నిధులు ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఇంటి స్థలాలు ఇవ్వలేని పక్షంలో ప్రభుత్వమే బాడుగ ఇంటికి అద్దె చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే దానికి చొరవ చూపాలని లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనకు పూనుకుంటామన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్. షానవాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి. లీలామోహన్, ఎరుకుల హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇట్టా వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దందారి కామేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి బొమ్మి విజయ్‌కుమార్, నేతలు లక్ష్మయ్య, సీనయ్య, విజయమ్మ, సుమతి , మాధవి, వెంకటేశ్వర్లు, ఉన్నారు.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ లో మెకానీ జెడ్ బోటు ద్వారా నిరంతర గస్తీ



బిట్రగుంట మార్చి 24 ప్రభాతవార్త జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ లో మంగళవారం మత్స్య శాఖ, ఫారెస్ట్, మెరైన్ పోలీసుల జాయింట్ టాస్కోఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో తీరంలో ప్రత్యేక మెకనై జెడ్ బోటు ద్వారా గస్తీని ముమ్మరం చేశారు. రాష్ట్ర ఉన్నత అధికారులు సూచనలు మేరకు ఏప్రిల్ 15 వ తేదీ వరకు వేట విరామం వరకు ఈ గస్తీని ముమ్మరం చేశారు. దీని ద్వారా ఈ ప్రాంత మత్యాకారులకు ఆత్మ స్థైర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక ఇతర రాష్ట్రాల నుండి వేటకు జాలర్లు రాకుండా సముద్ర సంపదను కొల్లాగొట్టగుంట నిరోధించవచ్చని వారు పేర్కొన్నారు.

వడ్డీపాలెంలో తాగునీటి సమస్య తీవ్రం : అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆవేదన

కొడవలూరు, మార్చి 24 ప్రభాతవార్త: మండలం పాతవంగళ్ళు పంచాయతీ పరిధిలోని వడ్డీపాలెం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారుతోంది. అధికారుల నిర్లక్ష్యంతో సరైన మోటార్లు ఏర్పాటు చేయకుండా కేవలం పైపులైన్ మాత్రమే వేసి, పాత మోటర్లతోనే నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. పనులను కాంట్రాక్టర్ ద్వారా సబ్ కాంట్రాక్ట్ ఇవ్వడం వల్ల నాణ్యత లేకుండా వదిలేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. "పైపులైన్ పూర్తయ్యాక కొత్త మోటార్ మరియు మెస్సు ఏర్పాటు చేస్తాం" అని హామీ ఇచ్చినప్పటికీ, ఏడాది గడిచినా అమలు కాలేదని, గతంలో పనిచేసిన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్ ను స్థానికులు సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం సంబంధిత అధికారి విడవలూరు మండలానికి మారిపోవడంతో, ఈ విషయంపై కొత్త అధికారినికి తెలుపుకోవడంతో, "కొంత సమయం కావాలి" అని సమాధానం ఇస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి మండల అధికారులు స్పందించి, సరైన మోటార్లు ఏర్పాటు చేసి గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జంక్‌పుడ్‌కి వ్యతిరేకంగా బోర్డులు ఏర్పాటు చేయాలి

కావలి, మార్చి 24 ప్రభాతవార్త : జంక్‌పుడ్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ పాఠశాలల్లో బోర్డులను ప్రభుత్వం ఏర్పాటు చేసి చైతన్యపరచాలని రూరల్ మండలం రుద్రకోట జడ్పి హైస్కూల్ ఉపాధ్యాయులు వి.క్రిష్టారెడ్డి కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గత కొంతకాలంగా జంక్‌పుడ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నష్టాలను వివరిస్తూ విద్యార్థులలో ప్రచారం చేపట్టామని తెలిపారు. పూర్ణత పాఠశాలలోని విద్యార్థుల జన్మదినాల సందర్భంగా చాక్లెట్లు, జంక్‌పుడ్‌లు పంపిణీ చేయకుండా గుగ్గిళ్ళు, సెనగలు వంటివి పంపిణీ చేయాలని ప్రోత్సహించిన కారణంగా విద్యార్థులకు ఓ విద్యార్థిని జన్మదినం సందర్భంగా సెనగలు, గుగ్గిళ్ళుపంపిణీ చేయడం జరిగిందన్నారు. జీవనశైలి వ్యాధులపై సమదర్శిని అనే రచయిత ప్రచురించిన కరపత్రాలను కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు.

మత్స్యకార సొసైటీల అభివృద్ధికి అవగాహన కలిగిన నాయకత్వం అవసరం

తోటపల్లి గూడూరు, మార్చి 24, ప్రభాతవార్త : మత్స్యకార సొసైటీల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టే వారు చదువుకున్నవారు, సమస్యలను సున్నితంగా గ్రహించే వారు ఉంటే సొసైటీల అభివృద్ధికి తోడ్పడుతుందని ప్రజలు భావిస్తున్నారు. మత్స్యకారుల జీవన విధానం, వృత్తి సంబంధిత సవాళ్లు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగిన నాయకత్వం ఉంటే సమాజానికి మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. స్థానిక పరిస్థితులను అర్థం చేసు కుని, సమయానికి సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులు ముందుకు రావాలని సూచిస్తున్నారు. అదే సమయంలో, అధికార వ్యవస్థతో సమన్వయం కలిగిన నాయకులు ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతాయని కూడా ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ అధికారులతో, ప్రజాప్రతినిధులతో సులభంగా చర్చలు జరిపి, అవసరమైన పనులను ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉండటం వల్ల సొసైటీకి ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. మత్స్యకారుల సంప్రదాయాలు, కట్టుబాట్లను గౌరవిస్తూ, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు నడిపించే నాయకత్వం అవసరమని ప్రజల అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

కోవూరు, మార్చి 24 ప్రభాతవార్త : కోవూరులోని నేతాజీనగర్‌లో ఉన్న వైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం భగత్ సింగ్ వర్థంతి సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గోడ పత్రికను జిల్లా అధ్యక్షుడు ఎం. సునీల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదేశం కోసం భగత్‌సింగ్ 23 సంవత్సరాలకే ప్రాణాలు వదిలాడన్నారు. అతి చిన్న వయస్సులోనే బ్రిటీష్ సామ్రాజ్యంపై యుద్ధానికి కాలు దువ్విన విప్లవ నేత అన్నారు. ఆయనను ఉరి తీసి 90 సంవత్సరాలు అయినా నేటికీ ఆయన ఆశయాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ దేశం కోసం విద్యార్థులు యువకులు భగత్ సింగ్ ఆశయాలతో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే షరూక్, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె. ఆశీర్వాదం, తదితరులు ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలి

కోవూరు, మార్చి 24 ప్రభాతవార్త : కోవూరు వ్యవసాయ శాఖ పరిధిలోని రైతులకు వరి పంటకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం రైతు విజ్ఞాన యాత్ర నిర్వహించడం జరిగిందని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రైతులు మంగళవారం సబ్ డివిజన్ కార్యాలయం నుంచి పొదలకూరులోని మునగాకు ప్రాసెసింగ్ పరిశ్రమ, కిసాన్ క్రాఫ్ట్ మేనిఫాక్చరింగ్ యూనిట్‌ను నిశితంగా సందర్శించి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎంత సేపటికీ వరి పంటనే సాగు చేస్తున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా లాభాలు కల్పించే పలు పంటలకు అవగాహన కల్పించేందుకే ఈ రైతు విజ్ఞాన యాత్రను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ విజ్ఞాన యాత్రను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని మునగాకు ప్రాసెసింగ్ యూనిట్‌ను నిశిత పరిశీలన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రజని, శ్రీహరి, సైంటిస్ట్ సురేఖ దేవి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

మిని హెల్త్ క్లీనిక్‌కి 8 లక్షల విలువ చేసే స్థలాన్ని ఆడిపూడి బ్రదర్స్ వితరణ

మనుబోలు మార్చి 24 ప్రభాతవార్త : మనుబోలు మండలం గురివిందపూడి గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే సోమిరెడ్డి మినీ హెల్త్ క్లీనిక్ శంకుస్థాపన చేసిన విషయం విదితమే ఈక్రమంలో దివంగత ఆడిపూడి వెంకురెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు బలరామిరెడ్డి,శ్రీహరిరెడ్డి సురేంద్రరెడ్డిలు సుమారు 8 లక్షలు విలువ చేసే 63 అంకణాలస్థలాన్ని గ్రామం అభివృద్ధి కోసంవితరణ గావిం చారు. తమ స్థలంను హెల్త్ క్లీనిక్‌కి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. స్థలానికి సంబందించిన పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే సోమిరెడ్డికి అందజేశారు. ఎమ్మెల్యే ఆడిపూడి బ్రదర్స్‌కి భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ప్రస్తుత సమాజంలో అనేక రకాల సేవలను చేస్తున్నాం కానీ ఆడిపూడి బ్రదర్స్ చేసిన లక్షల రూపాయాల స్థల వితరణ గురించి ప్రతి ఒక్కరు ప్రత్యేకంగా చెప్పుకోవడం విశేషమన్నారు.

స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో ఉత్తరాంధ్ర అభివృద్ధి ఇక వేగం పుంజుకోనుంది



నెల్లూరు, మార్చి 24, ప్రభాతవార్త –వైద్యం స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో ఉత్తరాంధ్ర అభివృద్ధి ఇక వేగం పుంజుకోనుందని, పరిశ్రమ రాకతో లక్షకు పైగా ఉద్యోగాలు యువతకు లభించనున్నాయని శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర అన్నారు. కేంద్ర మంత్రికుమార స్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేసిన ప్రపంచ స్థాయి సమీకృత ఉక్కు కర్మాగారం రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. రాష్ట్ర యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు నారా లోకేష్ శక్తికి మించి పని చేస్తున్నారు. అనకాపల్లిలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఘనత నారా లోకేష్‌దే అన్నారు. జాబ్ ఫస్ట్ విజన్‌తో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేష్ సాధించిన ఈ ప్రాజెక్టు ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు పారిశ్రామిక ఆవిష్కరణల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెడుతుందన్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయి. ఒక జూమ్ కాల్ సమావేశంలో దేశంలోనే అతి పెద్ద ఉక్కు కర్మాగారం రాష్ట్రానికి వచ్చింది. పెట్టుబడి దారులతో నిరంతర చర్చలు, ప్రత్యక్ష సమన్వయం, తక్కువ సమయంలో క్లియరెన్స్‌లతో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్‌ను స్వర్గధామిగా మార్చింది కూటమి ప్రభుత్వం అన్నారు.

మొబైల్ యాప్ వినియోగంపై రైతులకు సూచనలు

కొడవలూరు, మార్చి 24, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని సచివాలయం ప్రాంగణంలో మంగళవారం రైతులకు నవధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయం, రైతు మొబైల్ యాప్ విని యోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారిణి విజయ లక్ష్మి మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు సంబంధించిన ప్రక్రియలను సక్రమంగా పాటించాలని సూచించారు. ప్రతి రైతు తమ పంట కోతకు కనీసం పది రోజుల ముందుగానే వి.ఏ.ఏ (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) ద్వారా షెడ్యూల్ చేయించుకోవాలని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నదని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే మండల పరిధిలో గుండా లమ్మ పాలెం, తలమంచి, యల్లాయపాలెం, గండవరం సొసైటీల పరిధిలో ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, రవాణా (ఎగుమతిదిగుమతి) ప్రక్రియలు కొనసాగుతున్నాయనివెల్లడించారు.ఈకార్యక్రమంలో తెలు గుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు జిలాని భాషా, గుండాలమ్మపాలెం సొసైటీ డైరెక్టర్ పంది శ్రీనివాసులు, నాయబ్ రసూల్, భాషి, అంబటి విజయ్, శ్రీనివాస్ యాదవ్, రమేష్, రహీం, మాబ్జాన్, షాజహాన్, శశి, అరవింద్, ప్రభాస్, సుశాంత్ మరియు వ్యవసాయ సిబ్బంది, వి.ఏ.ఏలు పాల్గొన్నారు.

నాపై కాకాణి తప్పుడు ఆరోపణలు రాష్ట్ర టిడిపి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణనాయుడు వెల్లడి

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 24 ప్రభాతవార్త : తనపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలను ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని రాష్ట్ర టిడిపి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణనాయుడు ఆరోపించారు. మంగళశారం నెల్లూరు జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన మీద తప్పుడు ఆరోపణలు, అబద్దాలు మాట్లాడడం సమంజసం కాదన్నారు. తాను కాకాణి లాగా కేసు పెడితే 60రోజులు 70రోజులు పారిపోలేదన్నారు. కాకాణిపైన వ్యక్తిగత ఆరోపణలు చేయాలంటే నా వద్ద చాలా ఉన్నాయని తెలిపారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడితే భయపడి పారిపోయే వాడిని కాదని గోడకి కొట్టిన బంతిలాగా లేచి రైతులకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని పేర్కొన్నారు. మీ కారు రేవ్‌పార్టీలో దొరికింది నిజం కాదా..? మీ ఎమ్మెల్యే స్టిక్కర్ దొరకలేదా అని ప్రశ్నించారు..? ఆయన వల్ల ఎంతమంది మహిళా అధికారులు బదిలీ అయ్యారని చెప్పారు. తాను ఆ సమయంలో కేవలం విశ్రాంతి కోసమే ఆ లాడ్జి ఆవరణంలో ఉన్నానని అక్కడ జరిగిన సంఘటనతో నాకు ఎలాంటి సంబంధం లేదని వివరించారు. దాడుల సమయంలో నన్ను తీసకెళ్లిన డిఎస్‌పి విచారణ చేసి స్వయంగా ప్రెస్‌మీట్‌కు ఓ ప్రకటన చేస్తూ రాధాక్రిష్ణనాయుడుకి ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని తెలిపినట్లు తెలిపారు. ఆయనపై ఎలాంటి కేసు లేదని అధికారికంగా స్పష్టం చేసినా సిగ్గు లేకుండా కాకాణి మాట్లాడుతున్నారని విమర్శించారు.

నిరుపేదలకు ఇంటిస్థలాన్ని కేటాయించి నిర్మాణానికి ఐదులక్షలు ఇవ్వాలి

కావలి, మార్చి 24 ప్రభాతవార్త : ప్రతి నిరుపేదలకు ఇంటి స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణానికి ఐదులక్షలు ఇవ్వాలని లేకుంటే అద్దె అయినా చెల్లించాలని సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు దామ అంకయ్య తెలిపారు. ఆ సంఘ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అర్హులైన పేదలతో ఆర్‌డిఓ కార్యాలయం వద్ద మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో దర్నా నిర్వహి ంచి ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సభ్యులు దామా అంకయ్య మాట్లా డుతూ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలు సొంత ఇంటికలను నెరవేర్చుకోలేక పోతున్నారని కొందరు రెక్కాడితేకాని డొక్కాడని పరిస్థితిలో ఉన్నారని అలాంటి వారు ఎందరో ఉన్నారని కనీసం వారు చేసే కూలిపనుల్లో వచ్చే డబ్బులు ఇంటి అద్దెలకు సరిపోవడం లేదని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ప్రతి నిరుపేదకు ఇంటిస్థలం ఇచ్చి, నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని హామి గుప్పించి అధికార ంలోకి వచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తిఅయినా ఇంతవరకు పేదలకు చెప్పిన హామీ నెరవేర్చక తుంగలో తొక్కారన్నారు. మాట తప్పిన కూటమి ప్రభుత్వంపై పేదల తరపున పోరాటాలు చేస్తున్న నాయకులపై దుర్భషలాడుతున్నారని తెలిపారు. పేదలందరికి ఇంటిస్థలాలు, వాటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇచ్చేంతవరకు నిరసలు ఆపమన్నారు. ఈ ఆకార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కోపర్తి నాగరాజు, శంకర్, కిశోర్, గుంజి సుబరత్తమ్మ, శిరీష, బోసే కె.నరసింహరావు, వెంకటసుబ్బయ్య, పార్వతమ్మ, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి, లోక్‌సత్తా మాలకొండరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు పూర్తిస్థాయిలో సహకరించాలి

కోవూరు, మార్చి 24 ప్రభాతవార్త : కోవూరు మండలంలో ప్రస్తుతం వరికోతలు పూర్తిస్థాయిలో ప్రారంభం అయ్యాయని ఈ పరిస్థితుల్లో మిల్లర్లు రైతులకు సహకరించాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరు మండలంలోని పలు రైస్ మిల్లులను మంగళవారం ఆయన పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైస్ మిల్లు తప్పనిసరిగా బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చి సీఎంఆర్ ద్వారా ధాన్యంను సేకరించాలన్నారు. అదేవిధంగా రైతులకు అవసరమైన గోతాలను సకాలంలో అందించేలా రైస్ మిల్లర్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రైస్ మిల్లులో వీఆర్వోలను ఏర్పాటు చేసి వారి ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. లారీల్లో, ట్రాక్టర్లలో ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా సకాలంలో దానికి అన్‌లోడ్ చేసేలా మిల్లర్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

వేపినాపి పిహెచ్‌సి వైద్యురాలికి క్షయ వ్యాధి ఉత్తమ అవార్డు

రాపూరు, మార్చి 24, ప్రభాతవార్త : అంతార్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం నెల్లూరులోని వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యలయంలో క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్న ఉత్తమ సిబ్బంది అవార్డులను వేపినాపి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రమీలా రాజకుమారి, రాపూరు సచివాలయం యంఎల హెచ్‌పి పి.సురేఖలకు డియంహెచ్‌ఓ డాక్టర్ సుజాతమ్మ, డి.ఎల్.ఎ.టి.ఓ డాక్టర్ ఖాధర్‌వలి చేతుల మీదుగా అవార్డు అందజేశారు. పిహెచ్‌సి పరిధిలో క్షయ వ్యాధి రోగులను గుర్తించడంతో పాటు వ్యాధి నిర్మూలనకు కృషి చేయడంలో విశేష ప్రతిభ కనపరిచినందుకు డాక్టర్ ప్రమీలా రాజకుమారికి, సచివాలయం పరిధిలో క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేసినందకుగాను యంఎల్‌హెచ్‌పి పి.సురేఖకు ఈ అవార్డులను అందజేశారు.అవార్డులు అందుకున్న స్ఫూర్తితో మరింతగావిదినిర్వహణలో రోగులకు సేవలను అందించాలని జిల్లా అధికారులకు వారికి సూచించారు. పిహెచ్‌సి పరిధిలో ఉత్తమ ఉద్యోగులుగా అవార్డు అందుకున్న డాక్టర్ ప్రమీలా రాజకుమారి, యంఎల్‌హెచ్‌పి పి. సురేఖను పిహెచ్‌సి సహచర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్‌వైజర్ శ్రీనివాసుల రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ పోలు కిశోర్ కుమార్ తదితరులున్నారు.

రైతులకు అండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



రాపూరు, మార్చి 24, ప్రభాతవార్త : రాష్టంలోని రైతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా నిలుస్తున్నట్లు రాపూరు క్లస్టర్ 4 ఇన్‌చార్జ్, తిరుపతి వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి తిక్కమనేని నరసింహ ప్రసాద్‌నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని శానాయపాళెం, ఆదురూపల్లి పంచాయితీలలో ఆయన వ్యవసాయాధికారులు, నాయకులతో కలసి రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టం ఆర్థిక ఇబ్బందులలో వున్నప్పటికి రైతుల, అభివృద్ధి ,సంక్షేమం విషయంలో సియం చంద్రబాబు నాయుడు ఎప్పుడు వెనుకడుగు వేయలేదన్నారు.వెంకటగిరి ఎమ్మెల్యేకురుగోండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మి కృష్ణమనాయుడు,జంగమ నాయుడు, ఉదయ బాస్కర్, కైపు సుధాకర్, రామరావు, రాజగోపాల్, వేణుగోపాల్, కోటేశ్వర రావు, పలువురు రైతులు వున్నారు.

చేజర్లలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేజర్ల మార్చి 24 ప్రభాతవార్త రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రమైన చేజర్ల సహకార కేంద్రంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దారు మస్తానయ్య, తెలుగు దేశం పార్టీ మండలాద్యక్షులు షేక్.సిరాజుద్దీన్, సొసైటీ అద్యక్షులు బి.వీర రాఘవరెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు బత్తల కృష్ణయ్య, మండల వ్యవసాయాధికారి హిమ బిందు రైతులతో కలిసి ప్రారంభించారు. అనంతరం తహసిల్దారు మాట్లాడుతు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం మద్దతు ధర లభిస్తుందని తెలియజేశారు. రైతులు దళారులను నమ్మి వరి ధాన్యాన్ని తక్కువ రేటుకు అమ్ముకోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వద్ద ధాన్యాన్ని అమ్ముకోవాలని కోరారు. మండలంలోని రైతులు అందరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల అద్యక్షులు గుండా విజయ బాస్కర్‌రెడ్డి, జగ్గారెడ్డి, ఎస్‌సిసెల్‌నాయకులు హజరత్తయ్య, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

తమిళ జాలర్ల అక్రమ చొరబాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 24, ప్రభాతవార్త : ఆంధ్ర ప్రాంత సముద్ర జలాలలో చొరబడి చేపల వేట సాగించే తమిళ జాలర్ల అక్రమాలకు శాశ్వతంగా చెక్ పెట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. కలక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మంత్రులు, జిల్లా శాసనసభ్యులు మరియు పోలీసు, ఫిషరీస్ శాఖల ఉన్నతా ధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తీర ప్రాంత మత్స్యకార సమస్యలపై స్పందించారు. జువ్వలదిన్నె సంఘటన జరిగాక నెలకొన్న అపోహలు తొలగించి ప్రభుత్వం అండగా వుందన్న సందేశాన్ని చేరవేయడం ద్వారా మత్స్యకారులలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు సూచించారు. తెలుగుదేశం పార్టీకి అండగా ఉండే మత్స్యకారులకు ప్రభుత్వం తోడుగా వుంటుందని ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ 15 నుండి 2 నెలల పాటు వేట నిషేధం అమల్లోకి నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వంతో సంప్రదించి ఇరు రాష్టాల మత్స్యకారుల పెద్దలను సమన్వయం చేసుకొని అక్రమ చేపలవేట సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఎన్ఎండి ఫరూఖ్, ఆనం రామ నారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, రాష్ట్ర ఫిషరీస్ కమీషనర్ రామ్ నాయక్, మారిటైమ్ ఛైర్మెన్ దామచర్ల సత్య,కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ అజితా వేజెండ్ల, శాసనమండలి సభ్యులు రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర, బల్లి కళ్యాణ చక్రవర్తి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దగ్గుమాటి వెంకట కృష్ణా రెడ్డి, పాశం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ, మత్స్యకార సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

కొత్తపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

కావలి, మార్చి 24 ప్రభాతవార్త : కావలి రూరల్ మండలం, కొత్తపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎంసి ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య పాల్గొని ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాడ రైతులు పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకొని ఉచితంగా పశువైద్యసేవలను పొంది లబ్దిపొందాలని కోరారు. ఏఎంసి డైరెక్టర్ తుమ్మల రమణమ్మతో కలసి రైతులకు మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ వైద్యశిబిరంలో 34దూడలకు నట్టల నివారణ 12 పశువులకు గర్భకోశచూడు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి లవణ మిశ్రమం పంపిణీ చేయడం జరిగింది. స్థానిక పశువైద్యశాల సంచాలకులు డాక్టర్ వైవి. కామేశ్వరరావు, పశువైద్యశాల వైద్యులు నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు,పశుసంవర్ధకశాఖ సహాయకులు, ఏఎంసి సూపర్‌వైజర్లు పి.సురేష్, సిబ్బంది పశు పోషకులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పై అవగాహన

గూడూరు రూరల్, మార్చి 24, ప్రభాతవార్త : క్షయ వ్యాధి పై అవగాహన కల్గి ఉండాలని డాక్టర్ జ్యోతి పేర్కొన్నారు. సోమవారం గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టి క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి పై అవగాహన లేకపోవడం వలన చాలా మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో నే గుర్తించి చికిత్స పొంది, క్రమంతప్ప కుండా మందులు తీసుకొని, పౌష్టికాహారాన్ని తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ఉమ్మే సల్మా, ఆసుపత్రి సిబ్బంది సురేంద్ర రెడ్డి, నాగేశ్వర రెడ్డి, అరుణ, ఉమ, వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలి

కావలి, మార్చి 24 ప్రభాతవార్త : ఆపరిష్కృతంగా మిగిలిపోయిన 12వ పిఆర్‌సి కమిషనర్‌ను వెంటనే నియమించాలని 29శాతం ఐఆర్‌ని ప్రకటించాలని, 4డిఏలను ప్రకటించాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్‌ను పునర్ధరించాలని హెల్త్ స్కీమ్ ఇతర సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ రాష్ట్ర కమిటీపిలుపు మేరకు రణబేరిలో భాగంగా యూటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయి నిరాహారదీక్షను చేపట్టడం జరిగింది. ఈకార్యక్రమంలో రాష్ట్ర అడిట్ కమిటీ సభ్యులు శ్రీదేవి జిల్లా కార్యదర్శులు ఐహెచ్‌సి ప్రసాద్, బి.మాధవరావు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు పి.రవికుమార్, సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు తాళ్లూరు మాల్యాద్రి యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు, కె.ఆదిశేషయ్య, మం దలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు దాదాపు 75మంది పాల్గొన్నారు.

మిల్లర్లు రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి

- తేమ శాతం పట్ల ఉదాసీన వైఖరి అవసరం - మిడతల రమేష్

నెల్లూరు అగ్రికల్చర్, మార్చి 24, ప్రభాతవార్త : ధాన్యం ధరలు రోజు రోజుకి పతనమవడం ఆందోళన కలిగిస్తున్న అంశమని భారతీయ జనతా పార్టీ నాయకులు మిడతల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం మిల్లర్లు సేకరిస్తున్న ధాన్యాన్ని ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మిల్లర్లు అధిక లాభాల కోసమే ధాన్యం సేకరణ చేయొద్దని, రైతు కుటుంబాల ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం ధరలు రోజు రోజుకి పతనం కావడం బాధ కలిగిస్తుందన్నారు. జిల్లాలో 90 శాత మంది మిల్లర్లకు డ్రయ్యర్ల వ్యవస్థ ఉంది. వరి సాగును నమ్ముకుని ఆర్థికంగా చితికిపోతున్న అన్నదాతలను కాపాడడం కోసం మిల్లర్లు తేమ శాతం విషయంలో గత 12 సంవత్సరాలుగా ఉన్న సంప్రదాయాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ద్వారా మిల్లర్లు సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐ ఇవ్వడంలోనూ కొంత లాభం ఉన్న విషయాన్ని రమేష్ వివరించారు. సేకరించిన ధాన్యాన్ని 67 శాతం మాత్రమే బియ్యం రూపంలో ప్రభుత్వానికి సీఎంఆర్(కష్టమ్ మిల్లుడ్ రైస్) కింద ఎఫ్‌సీఐకి మిల్లర్లు అందిస్తారని తెలిపారు. మిగిలిన 33శాతంలో 40 కేజీల నూకలు 20 కేజీల జీరు(సన్న నూకలు) 50 కేజీల తవుడు, 150 కేజీలు పొట్టు రూపంలో పుట్టికి 2,900 రూపాయలు మిల్లర్లకు మిగులుతుందన్నారు. మిల్లర్లు ఇవ్వన్నీ దృష్టిలో పెట్టుకొని తేమశాతం సేకరించే విషయంలో పాత సాంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు.

నారాయణలో అత్యంత క్లిష్టమైన అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం

నెల్లూరు, మార్చి 24, ప్రభాతవార్త-వైద్యం : తీవ్రమైన ఆయాసం, ఊపిరి అందక ఇబ్బంది పడుతున్న, నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం చింతోపు గ్రామానికి చెందిన వ్యక్తికి శ్వాసనాళ పునర్నిర్మాణానికి సంబంధించిన క్లిష్టమైన శస్త్ర చికిత్సను నారాయణ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ దీప్‌క్ చౌదరి మాట్లాడుతూ ఊపిరి అందక ఎమర్జెన్సీకి వచ్చిన ఈ పేషెంట్‌కు గొంతు ద్వారా ట్యూబ్ వేసేందుకు వీలుకాకపోవడంతో, శ్వాసనాళం చాలా చిన్నగా ఉన్నందున అత్యవసరంగా శ్వాసనాళంలో చిన్న రంధ్రం చేసి(ట్రకియాస్టమి) ట్యూబ్వేసి ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడడం జరిగిందన్నారు. అనంతరం పేషెంట్‌కు శ్వాసనాళ సంబంధిత ఆపరేషన్ అవసరమని భావించి డాక్టర్ ద్వారకానాథ్‌కి సిఫార్సు చేయడం జరిగిందన్నారు. అనంతరం నారాయణ హాస్పిటల్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ టి.ఆర్ ద్వారకానాథ్ మాట్లాడుతూ శ్వాసనాళ పునర్నిర్మాణానికి సంబంధించిన ఈ శస్త్ర చికిత్స ఎంతో ప్రత్యేకమైన, అరుదైనదని తెలిపారు. శ్వాసనాళం చాలా వరకు మూసుకునిపోయి(3-4 మి.మీ) ఉన్నందువలన సర్జరీ సమయంలో ఆక్సిజన్ అందించేందుకు పూర్తి మత్తు ఇచ్చేందుకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి అని, అయితే చెక్ బ్రాంకోస్కోపి చేసి, ఒక వేళ పేషెంట్ వెంటిలేట్ అయతే కార్డియోపల్మనరీ బైపాస్‌ను స్టాండ్ గా పెట్టుకుని ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. నారాయణ హాస్పిటల్లోని వైద్యులు బృందం అత్యాధునిక సదుపాయాలు ఉన్నందున క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతంగా చేస్తున్నామన్నారు. అనంతరం గుండె మత్తు వైద్య నిపుణులు డాక్టర్ విజయ మాట్లాడుతూ శ్వాస నాళం 3-4 మి.మీ ఉన్న వ్యక్తికి ఆపరేషన్ ప్రారంభానికి ముందు నుంచి ఆపరేషన్ అయ్యే వరకు మత్తు ఇవ్వడమనేది చాలా కీలకమన్నారు. ఈ సందర్భంగా నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్‌రావులపల్లి మాట్లాడుతూ గతంలో నారాయణ హాస్పిటల్లో అనేక క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అయితే ఈ శస్త్ర చికిత్స కూడా ఎంతో సంక్లిష్టమైనదని, అన్ని విభాగాల వైద్యులు ఒకే చోట అందుబాటులో ఉండడం, అత్యాధునిక పరికరాలు, అత్యున్నత ప్రమాణాలతో ఈ క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్రిటికల్ కేర్ ఫిజీషియన్ డాక్టర్ విజయ్కుమార్, హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు, క్రీడా గాయాలతో పెరుగుతున్న భుజం, మోకాళ్ళ సమస్యలు

- మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు వెల్లడి- ఆధునిక ఆర్థోస్కోపి చికిత్సతో వేగంగా కోలుకునే అవకాశం
- నిర్లక్ష్యం చేస్తే చేతి కదలికలు కోల్పోయే ప్రమాదం- నిపుణుల హెచ్చరిక

నెల్లూరు, మార్చి 24, ప్రభాతవార్త–వైద్యం : ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవనశైలిలో రోడ్డు ప్రమాదాలు, జిమ్ వ్యాయామాలు, క్రీడల సమయంలో తలెత్తుతున్న గాయాల కారణంగా భుజం, మోకాళ్ళ సంబంధిత సమస్యలు గణనీయంగా పెరుగుతున్నాయని నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు తెలిపారు. ఈ సమస్యల పట్ల ప్రజల్లో అవగాహనకల్పించేందుకు నిర్వహించిన షోల్డర్ ఆర్థోస్కోపి అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ ప్రత్యేక సమావేశంలో పలు కీలక అంశాలను వెల్లడించారు. సాధారణంగా బైక్‌పై నుంచి జారిపడడం,క్రికెట్,బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో పాల్గొనడం లేదా జిమ్‌లో సరైన పర్యవేక్షణ లేకుండా, అధికబరు వులు ఎత్తడం వంటి సందర్భాల్లో భుజం, మోచేతి, మోకాళ్ళపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీని వల్ల ముఖ్యంగా కింద సమస్యలు తలెత్తుతున్నాయి. రోటేటర్ కఫ్ టియర్లు: భుజం కీలును పట్టి ఉంచే కండరాలు చిరిగిపోవడం. లింగమెంట్ డ్యామేజ్: కీళ్ల మధ్య ఉండే బంధనాలు దెబ్బతినడం వల్ల కీలు పట్టుకోల్పోవడం షోల్డర్ డిస్లొకేషన్ భుజం కీలు తన స్థానం నుంచి పక్కకు జరగడం టెన్నిస్ ఎల్బో మోచేతి కండరాల వాపు వల్ల వచ్చే తీవ్రమైన నొప్పి. డాక్టర్ ఎంసీ వినోద్ కుమార్ మాట్లాడుతూ భుజం, మోచేతి గాయాల పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను, ఆధునిక చికిత్సా విధానాలను సుదీర్ఘంగా వివరించారు. సాధారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లేదా క్రీడల్లో గాయపడినప్పుడు చాలా మంది బాహ్యంగా కనిపించే గాయాలకు మాత్రమే చికిత్స తీసుకుంటారు. కానీ భుజం లోపల ఉండే లింగమెంట్ టియర్ లేదా రోటేటర్ కఫ్ డ్యామేజ్ వంటి అంతర్గత సమ్యలను గుర్తించడంలో విఫలమవుతుంటారు. భుజం నొప్పిని కేవలం సాధారణ నొప్పులుగా భావించి పెయిన్ కిల్లర్లతో కాలం వెళ్లదీయటం వల్ల, భవిష్యత్తులో ఆ కీలు పూర్తిగా బిగుసుకుపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఆర్థోస్కోపి విధానం ఒక వరమని చెప్పవచ్చు. దీనినే కీ- హోల్ సర్జరీ అని కూడా పిలుస్తారు. ఈ పద్ధతిలో పెద్ద కోతలు లేకుండా, కేవలం చిన్న రంధ్రాల ద్వారా కెమెరాను పంపి లోపల ఉన్న సమస్యను ఖచ్చితంగా గుర్తించి చికిత్స చేస్తాము. దీని వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు తక్కువ రక్తస్రావం సాంప్రదాయ సర్జరీలతో పోలిస్తే ఇందులో కోతలు చాలా చిన్నవిగా ఉంటాయి. వేగంగా కోలుకోవడం రోగి సర్జరీ జరిగిన అతి తక్కువ సమయంలోనే డిశ్చార్జ్ అయి, తమ దైనందిన పనులకు తిరిగి వెళ్లవచ్చు. తక్కువ నొప్పి కండరాలను కత్తిరించాల్సిన అవసరం ఉండదు. కాబట్టి నొప్పి చాలా తక్కువగా ఉంటుంది. ప్రమాదం జరిగిన వెంటనే లేదా భుజంలో కదలి యువతలో పెరుగుతున్న సమస్యలు– డాక్టర్ ఎంవీ సుధాకర్ నేటి యువత ఫిట్నెస్ పట్ల ఆసక్తితో జిమ్, క్రీడల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అయితే శాస్త్రీయ పద్ధతులు పాటించకపోవడం వల్ల టెన్నిస్ ఎల్బో, భుజం గాయాల భారిన పడుతున్నారు. నొప్పి ప్రారంభమైన తొలి దశలోనే వైద్యులను సంప్రదిస్తే ఫిజియోథెరపీ లేదా మందులతో నయం చేయవచ్చు. సమస్య తీవ్రమైతే ఆర్థోస్కోపీ వంటి శస్త్ర చికిత్సలు అవసరమవుతాయి. ఆధునిక వైద్య పరిజ్ఞానంతో తక్కువ కోతతోనే చికిత్స అందించే సౌలభ్యం మెడికవర్ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉంది. ఏదైనా గాయం జరిగినప్పుడు వెంటనే నిపుణులైన ఆర్థోపెడిక్ సర్జన్లను సంప్రదించి, అవసరమైన ఎక్స్ రే లేదా ఎంఆర్ఐ స్కాన్ల ద్వారా సమస్యను గుర్తించడం ఎంతో అవసరమని వైద్య బృందం సూచించింది. సరైన సమయంలో స్పందిస్తే సంక్లిష్ట శస్త్ర చికిత్సల అవసరం లేకుండానే పూర్తి స్థాయిలో కోలుకోవచ్చని స్పష్టం చేశారు.

పొదలకూరు నిమ్మ రైతులకు మంచి రోజులొచ్చాయి

పొదలకూరు, మార్చి 24, ప్రభాతవార్త : రెండు నెలల క్రితం వరకు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడిన పొదలకూరు మండల నిమ్మ రైతులకు మంచి రోజులు వచ్చాయి. పొదలకూరు మండలంలో నిమ్మ రైతుల జీవితాల్లో మళ్లీ వెలుగులు నిండుతున్నాయి. రెండు నెలల క్రితం వరకు ధర లేక తీవ్ర నిరాశలో కూరుకుపోయిన రైతులు, ఇప్పుడు మార్కెట్‌లో వచ్చిన అనూహ్య మార్పులతో ఆశలతో ముందుకు చూస్తున్నారు. మొన్నటి వరకు ఖర్చులు కూడా తిరిగి రాక ఇబ్బందులు పడిన రైతులకు, ప్రస్తుతం పెరిగిన ధరలు ఊరటనిస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు నిమ్మకాయల బస్తా ధర కేవలం 800 వరకు పడిపోవడం రైతులకు తీవ్ర ఆర్థిక దెబ్బగా మారింది. సాగు ఖర్చులు, కార్మిక వ్యయం, రవాణా ఖర్చులు అన్నీ కలిపి నష్టాలే మిగిలాయి. అయితే ఇప్పుడు అదే బస్తా ధర ఒక్కసారిగా 7,000 నుంచి 8,000 మధ్యకు చేరడం పరిస్థితిని పూర్తిగా మార్చేసింది.మంగళవారం నాటికి మంచి క్వాలిటీ నిమ్మకాయల బస్తా ధర సుమారు 7,500 రూపాయలు పలికింది. ఇటీవల రెండు రోజుల క్రితం ఇది 8,000కు చేరడం ఈ ఏడాదిలో గరిష్ట ధరగా నమోదైంది. అయితే మార్కెట్‌లో ధరలు స్థిరంగా లేకుండా రోజువారీగా మారుతున్నాయి. ఒక రోజు 500 తగ్గితే, మరో రోజు అదే మొత్తంలో పెరుగుతూ రైతులకు ఉత్కంఠ కలిగిస్తున్నాయి. పొదలకూరు మండలం నిమ్మ సాగులో ప్రముఖ ప్రాంతంగా నిలిచింది. దాదాపు 5,000 హెక్టార్లలో నిమ్మ పంట సాగవుతుండగా, ఇక్కడి నిమ్మకాయలు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందాయి. కోల్‌కత్తా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్, పాట్నా, ఆగ్రా, గయ వంటి ప్రధాన మార్కెట్లకు ఇక్కడి నుంచి భారీగా సరఫరా జరుగుతోంది. నిమ్మకాయలను బస్తాలుగా ప్యాక్ చేసి పంపిస్తారు. ఒక బస్తాలో సుమారు 80 కిలోల నిమ్మకాయలను జాగ్రత్తగా అమర్చి పార్శిల్ చేస్తారు. వేసవి సీజన్ ప్రారంభమవడంతో డిమాండ్ మరింత పెరిగింది. రోజుకు దాదాపు 20 లారీలు, ఒక్కో లారీకి 25 టన్నుల లోడుతో వివిధ రాష్ట్రాలకు రవాణా జరుగుతున్నాయి. పొదలకూరు లెమన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి అట్ల ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. దేశవ్యాప్తంగా ఎండలు పెరగడం వల్ల నిమ్మకాయలకు డిమాండ్ గణనీయంగా పెరిగిందన్నారు. ముఖ్యంగా వేసవిలో నిమ్మరసం, శీతల పానీయాల వినియోగం అధికమవడం దీనికి కారణమని చెప్పారు. అయితే ధరలు పూర్తిగా స్థిరంగా లేవని, ఇతర రాష్ట్రాల్లో వాతావరణ మార్పులు, సరఫరా పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయని ఆయన వివరించారు. అందువల్ల రోజువారీగా 500 వరకు ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని చెప్పారు.ఇటీవల వరకూ నష్టాల్లో కూరుకుపోయిన నిమ్మ రైతులకు ఇప్పుడు మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా మారాయి. పెరిగిన ధరలు రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపగా, భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాయి. రైతుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం, వారి కష్టానికి లభించిన ఫలితమే అని చెప్పాలి.

టిబి ముక్త పంచాయితీగా మహమ్మదాపురం

పొదలకూరు, మార్చి 24, ప్రభాతవార్త : టీబి ముక్త పంచాయితీ, టీబి నోటిఫికేషన్, టిబి ప్రివెన్షన్ కంట్రోల్ పట్ల ఉత్తమ సేవలు అందించినందుకు గాను మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 7 ప్రతిభ పురస్కారాలు, నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. సుజాత, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్‌కె. ఖాదర్వల్లి, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం రమేష్ చేతుల మీదగా డాక్టర్ వి. నరసింహారావుకి, డాక్టర్ వి. శ్రీకావ్యకి, ఎంపిహెచ్‌ఈఓ టి. రవికుమార్‌కి, ఎంఎల్‌హెచ్‌పి/సిహెచ్‌ఓ సిహెచ్. పెంచలమ్మకి, ఎండి. రఫీకి, ఎంపిహెచ్‌ఏ ఎం. వెంకటేశ్వర్లుకి, ఎంపిహెచ్ఏ (ఎఫ్)జి. మేరికి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

పొదలకూరు, మార్చి 24, ప్రభాతవార్త : పొదలకూరు మండలంలోని శాంతి నగర్ తోడేరు గ్రామ రైతులకు సమగ్ర యాజమాన్య పద్దతులపై రైతులకు శిక్షణ కార్యక్రమంలో (ఆర్ పి ఎల్ బేసిడ్ ట్రైనింగ్) భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు కె. శివ నాయక్ రైతులకు వరి పంట కోత అనంతరం పప్పు దినుసులు అయిన మినుము, పెసర, పిల్లి పెసర సాగు చేయుట వలన పంట మార్పిడి వల్ల చీడ పీడలను అరికట్టవచ్చు అని తెలిపారు. అదే విధంగా మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు ఐన జీలుగా, జనుము, నవధాన్యలు చల్లుకోవటం ద్వారా భూమిలో సత్తువ పెరిగి సేంద్రియ కార్బనం పెరగటం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గును అదే విదంగా వేసవిలో భూమి లోని నీటిని ఆవిరి అవ్వకుండా పైరు తో భూమిని కప్పి ఉంచవచ్చు అని ఆయన రైతులకు తెలిపారు. ఉద్యాన వన పంటలైన నిమ్మ, మామిడి, కూరగాయ పంటలు సాగు చేసుకోనే రైతులకు డ్రిప్, మర్చింగ్ షీట్స్ రైతులకు సబ్సిడీపై అందించుట జరుగుచున్నది కావలసిన రైతులు మీ రైతు సేవ కేంద్రం పరిధిలో గ్రామ వ్యవసాయ మరియు ఉద్యాన సహాయకులను సంప్రదించి రైతు వివరాలు ఇవ్వవలసినదిగా అని ఆయన రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఈఓ రాజ మోహన్, వివిఎయు ప్రతాప్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది అరుణ, సుధారాణి, కల్పన, రూస్సీ, సురేంద్ర, రైతులు అట్లా శ్రీకాంత్, రమణయ్య,వెంకటేశ్వర్లు, తురక మస్తానయ్య, సుగుణ, తిరుపతమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక లభ్యం

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కోట, మార్చి 24 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన ఓ గిరిజన బాలిక ఈ నెల 19న అదృశ్యమైన విషయం తెలిసిందే. ఆ మేరకు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన ఓ యువకుడితో గుంటూరు జిల్లా గురజాలకు వెళ్లింది. పోలీసులు దర్యాప్తు చేసి గురజాలకు వెళ్లి ఆ బాలికను తీసుకొచ్చి సోమవారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. మైనర్ బాలికకు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన యువకుడు గురజాలలో బేల్దారి పనిచేసుకునే వాడని ఎస్ఐ తెలిపారు.

గ్రామ పంచాయితీ కార్యాలయము, గండవరం

కొడవలూరు మండలం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆర్.ఓ.సి.నెం. 04/2026 తేది: 14.03.2028

టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కొడవలూరు మండలం, గండవరం గ్రామ పంచాయతికి 2026-2027 సంవత్సరమునకు (తే 01.04. 2026ది, తే 31.03.2027 ది వరకు) ఈ క్రింది షెడ్యూలలో తెలిపిన ప్రకారము సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లలో పాల్గొనువారు తే 28.03.2026ది న మధ్యాహ్నం 02.00 గంటల వరకు టెండరు డిపాజిట్లు చెల్లించి టెండర్లు దాఖలు చేయవచ్చును. తే 28.03.2026 ది సాయంత్రం 03.00 గంటలకు టెండరుదార్ల సమక్షమున టెండర్లు తెరువబడును, టెండరు ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును. ఇతర వివరములు కార్యాలయము పనివేళలయందు అడిగి తెలుసుకొనవచ్చును.

క్ర.సం.	టెండర్ వివరములు	ధరావత్తు
1	2026-2027 సం॥నకు వీధి విద్యుత్ పరికరములు దఫాలవారిగా సరఫరా చేయుట	200.00
2	2026-2027 సం॥నకు PWS విడిభాగములు దఫాలవారిగా సరఫరా చేయుట	100.00
3	2026-2027 సం॥నకు పబ్లిక్ హెల్త్ విడిభాగములు దఫాలవారిగా సరఫరా చేయుట	100.00
4	2026-2027 సం॥నకు LF మరియు స్టేషనరీ వస్తువులు దఫాలవారిగా సరఫరా చేయుట	100.00
5	2026-2027 సం॥నకు PWS మోటర్లు, పంపుసెట్స్, స్టాటర్లు, మరియు ఇతర రిపేర్లు మరియు వెల్డింగ్ చేయుట (అనుభవము గల మెకానిక్ ద్వారా)	100.00
6	2026-2027 సం॥నకు గ్రామ పంచాయతిలో సేవలు చేయించుటకు గాను కాంట్రాక్ట్ లేబరును 5 మందిని సరఫరా చేయుట (స్వీపర్లు-2, నీటి పంప్ ఆపరేటర్-1, ఎలక్ట్రీషియన్-1, ట్రాక్టర్ డ్రైవరు-1)	1000.00

గమనిక: షరతులు వర్తించును. పై టెండర్లు ఆమోదము తెలుపుటకు లేదా రద్దు పరచుటకు గాని తుది నిర్ణయము పంచాయతీవారిది. టెండరు తేది శెలవు దినము ప్రకటించినయెడల మరుసటి కార్యాలయము పని వేళలయందు స్వీకరించబడును. వీధి నిర్వహణలో ఏదేని ప్రమాదములు జరిగిన యెడల పంచాయతి వారు భాద్యులుకారు. ఎటువంటి నష్ట పరిహారము చెల్లించబడదు.

సం/- పి.సుజిత, పంచాయతి కార్యదర్శి, గండవరం గ్రామ పంచాయతి.

కావలి పురపాలక సంఘం

ఇ - ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. 542/2025/ఇ1 తేది: 24-03-2026

కావలి పురపాలక సంఘము - ఇంజనీరింగ్ విభాగము జనరల్ నిధులు నుండి టెండరు నెం. 96 మరియు 97లు 'ఇ' ప్రొక్యూర్మెంట్ ఆన్ లైన్ టెండర్లు కోరబడుచున్నవి.

బిడ్ స్వీకరించుటకు ప్రారంభ తేది మరియు సమయం 24-03-2026. రా.గం. 07.00 లకు

బిడ్ స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం. 02-04-2026. ఉ.గం.11.00.ల వరకు

మిగతా వివరములు www.apeprocurement.gov.in. నందు సంప్రదించవలెను. సంప్రదించవలసిన సెల్ నెం. 9494698929

కమీషనరు, కావలి పురపాలక సంఘం, కావలి

కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, గూడూరు గ్రూప్-II దేవస్థానములు

గూడూరు టౌన్ & మండలం, తిరుపతి జిల్లా

ఆర్.ఓ.సి.నెం. Nil/2026 తేది: 23.03.2026

సీల్ టెండరు, బహిరంగ వేలం ప్రకటన

తిరుపతి జిల్లా, గూడూరు మండలం, గూడూరు టౌన్ లోని శ్రీ ధర్మరాజస్వామి వారి దేవస్థానమునకు సంపూర్ణ హక్కు అనుభవము కలిగి తూర్పు గూడూరు నందు సర్వే నెం. 669/D లోని య.0.38 సెం., 1605 లోని య.0.44 సెం. మరియు తిరుపతి జిల్లా, గూడూరు మండలం గూడూరు టౌన్ లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునకు సంపూర్ణ హక్కు అనుభవము కలిగి చెన్నూరు గ్రామం నందు గల సర్వే నెం.1720 లోని 0.31 సెం., 323/1 లోని య. 1.19 సెం. మరియు 323/2 లోని య.1.19 సెం. భూమిని 11 సం" లీజునకు ఇచ్చుటకు గాను బహిరంగ వేలంపాటలు, సీల్డు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు కొరకు రూ.200/- చెల్లించి ప్రకటన తేది నుండి తేది. 08-04-2026 ఉదయం 11.00 గం"ల వరకు దేవస్థాన కార్యాలయము నందు పొందవచ్చును. పూర్తి చేసిన షెడ్యూలను సీల్డు కవరులో ఉంచి తేది.09-04-2026 ఉదయం 9:00 గం" ల లోపు శ్రీ ధర్మరాజస్వామి వారి దేవస్థానము నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదే రోజు ఉదయం 11.00 గం" లకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు ఓపన్ చేయబడి దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆమోదమునకు లోబడి తక్కువ టెండరుదారుని పేర్లు ప్రకటించబడును.

పూర్తి వివరములకు పై దేవస్థాన కార్యాలయమునందు సంప్రదించవలెను.

M. రవి క్రిష్ణ, కార్యనిర్వాహణాధికారి సెల్: +91-7981294396

నెల్లూరులో పేదల ముంగిటకే వైద్యం

నెల్లూరు, మార్చి 23, ప్రభాతవార్త-వైద్యం : నెల్లూరు నగరంలోని 15వ డివిజన్‌లో నారాయణ నేత్ర జ్యోతి నారాయణ దంత సురక్ష కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయి . రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగురు నారాయణ ఆదేశాల మేరకు, ప్రతి డివిజన్‌లోని నిరుపేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ మహోద్యమం కొనసాగుతోంది. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ శిబిరాల్లో ఇప్పటివరకు 1600 మందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోగా, వారిలో 890 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అంతేకాకుండా, దృష్టి లోపంతో బాధపడుతున్న 25 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి వారికి కంటిచూపును ప్రసాదించారు. పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారి ఇంటి వద్దకే వైద్య సేవలు తీసుకురావాలన్న మంత్రి సంకల్పం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుధా,ప్రశాంత్..15వ డివిజన్ కార్పొరేటర్ గణేష్ సుజాత వెంకటేశ్వర రెడ్డి,డివిజన్ అధ్యక్షుడు కేపీ చౌదరి, క్లస్టర్ ఇంచార్జి అంచురి శ్రీనివాసులు నాయుడు.. యూనిట్ ఇన్చార్జ్ లు ప్రసాద్ రావు, పరశురాం, వెంకటరమణ..బూత్ కన్వీనర్లు. స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

కొనుగోలు కేంద్రాలు ఉన్న రైతుకు ప్రయోజనం లేదు : రైతు సంఘం విమర్శ

కొడవలూరు, మార్చి 24 ప్రభాతవార్త : రైతు పండించిన వరి ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని నార్త్ రాజుపాలెం సిఐటియు కార్యాలయంలో ఈ మేరకు విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలో సుమారు 22 వేల ఎకరాల పైబడి రైతులు ఆర్ఎన్ఆర్, కేఎన్ఎమ్, బిపిటి వంటి వరి రకాలను సాగు చేసినట్లు తెలిపారు. ఈ పంటల కోసం రైతులు అధిక ఖర్చుతో యూరియా, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి, కష్టపడి పండించారని పేర్కొన్నారు. ప్రస్తుతం వరి కోతలు జోరుగా కొనసాగుతున్నప్పటికీ, ఒకటి రెండు రకాల మినహా మిగతా ధాన్యాన్ని మిల్లర్లు, దళారులు కొనుగోలు చేయడంలేదని విమర్శించారు. తమిళనాడు వ్యాపారులు ఆర్ఎన్ఆర్ రకాన్ని రూ.20, వేలు కు, కేఎన్ఎమ్ రకాన్ని రూ.18 వేలు కు కొనుగోలు చేస్తుండగా, బిపిటి రకానికి డిమాండ్ లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులకు మద్దతు ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పుట్టి ధాన్యానికి రూ.20,306 ధరప్రకటించినప్పటికీ, రైతులు రూ.1,000 నుంచి రూ.3వేలు వరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం, జిల్లా మంత్రులు స్థానిక ఎమ్మెల్యే తక్షణమే జోక్యం చేసుకొని, మిల్లర్లతో సంబంధం లేకుండా ప్రభుత్వం ద్వారానే ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘ కన్వీనర్ గొనె దయాకర్, దోలా రామచంద్రయ్య, మహబూబ్ బాషా, దయానందం, పూల గండ్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం జీప్ జాతా

తోటపల్లి గూడూరు, మార్చి 24, ప్రభాతవార్త: మత్తు పదార్థాల వినియోగం యువతను దారి తప్పిస్తున్న నేపథ్యంలో సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు జీప్ జాతా నిర్వహిస్తున్నట్లు సిపిఎం నేతలు తెలిపారు. మహిళా సంఘం (ఐద్వా), డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, జనవిజ్ఞాన వేదిక, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ జీప్ జాతా ఈ నెల 25వ తేది బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు తోటపల్లి గూడూరు మండలానికి చేరుకోనుందని వెల్లడించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజలు, యువకులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల హెడ్ క్వార్టర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన సమావేశంలో ఎస్సై వీరేంద్రబాబు మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా నష్టపోతాయని హెచ్చరించారు. యువత మంచి మార్గంలో నడిచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఈపూర్ లక్ష్మయ్య మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యతిరేకంగా సమాజంలో అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. యువత మేలుకొని మత్తుపదార్థాలను వదులుకోవాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి వర్గం కలిసి డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈపూర్ లక్ష్మయ్య, బండి శబరి, మారుబోయిన రాజా, మాచర్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జివిఆర్‌లో రక్తదాన శిబిరం

కోట, మార్చి 24 ప్రభాతవార్త చిట్టేడులోని జివిఆర్ కంపె నీలో జివిఆర్ వ్యవస్థాపకులు గ్రంధి వెంకట శ్వరరావు 86వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ముందుగా గ్రంధి వెంకటేశ్వ రరావు చిత్రపటానికి ఆయన తన యుడు జివిఆర్ ఎండి చల్లారావు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈసం దర్భంగా వెంకటేశ్వరరావు చిత్రపటానికి ఫ్యాక్టరీలోని కార్మికులు పూలమాల వేసి నివాళి అర్పించారు. పలు వురు కార్మికులు మాట్లాడుతూ జివిఆర్ సంస్థలో ఎంతోమంది ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఆ మహనీ యుడు అందరి మధ్య భౌతి కంగా లేకపోయినా అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పా రు. మహోన్నత వ్యక్తిత్వం కలిగిన మహనీయుడి సంస్థలో పనిచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఎంతోమందికి జీవనోపాధి కల్పించి తమ కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. అనంతరం జివిఆర్ ఎండిచల్లారావు మాట్లాడుతూ ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానంగా మిగులుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటాయని చెప్పారు. అలాంటి వారికి యువత, కార్మికులు చేసే రక్తదానం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుందన్నారు. గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ క్యాంప్ వైద్యాధికారి డాక్టర్‌లావణ్య, సిబ్బంది వచ్చి 150 మంది నుంచి రక్తం సేకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.జిఎం కృష్ణ, సంస్థ ఉద్యోగులు, కార్మికులు చిట్టిబాబు పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో హోమాలు

కోట, మార్చి 24 ప్రభాతవార్త కోట మండలం విద్యానగర్‌లోని శ్రీ విద్యా గణపతి ఆలయంలో జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళ వారం ఆలయం ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో హోమాలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, మృత్యుంగ్రహణ, అంకురార్పణ, వాస్తుపూజ, లక్ష్మీ గణపతి హోమం జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హోమంలో మొక్కులు తీర్చుకున్నారు.

కార్మికులకు ఈఎస్ఐ పై అవగాహన కల్పించాలి

గూడూరు, మార్చి 24, ప్రభాతవార్త గూడూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ హాస్పిటల్ ద్వారా కల్పిస్తున్న సేవలు గురించి తెలియడం లేదని క్యాంపుల నిర్వ హించి వారికి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఈఎస్ఐ రాయలసీమ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పద్మజాతెలిపారు. గూడూరు పట్ట ణంలోని గమల్లపాలెంలో ఉన్న ఈఎస్ఐ హాస్పిటల్‌ను రాయలసీమ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పద్మజ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలు మందుల నిల్వ గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ పద్మజ మాట్లాడుతూఈ.ఎస్.ఐ హాస్పిటల్స్ ద్వారా కల్పించేసౌకర్యాల గురించి చికంపెనీలో పనిచేస్తున్న వారికి తెలియడం లేదని అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వీటి గురించి కార్మికులకు తెలిసేలా క్యాంపులు ఏర్పాటు చేసి తెలియజేస్తామని అన్నారు.

నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

గూడూరు, మార్చి 24, ప్రభాతవార్త కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన నూతన పిఆర్సి కమిషన్ ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని నాలుగు డిఏలు బకాయిలు ఉన్నా యని ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెం టనే పరిష్కరించాలని యుపిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రవిడిమాండ్ చేశారు. గూడూరు పట్టణం లోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరాహార దీక్షలు ప్రారం భించారు. తమ డిమాండ్ల పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రవి మాట్లాడుతూ నూతన ప్రభుత్వాలు వచ్చినప్పుడు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తారని అయితే రెండు సంవత్సరాలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం వచ్చి ఎంతవరకు పిఆర్సి కమిషన్ వేయలేదని కోట్ల రూపాయలు ఉపాధ్యాయులకు బకాయిలు అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు డిఏలు పెండింగ్లో ఉన్నాయని కరోనా సమయంలో అనేకమంది ఉపాధ్యాయులు చనిపోయారని వారి కుటుంబాల్లో వారికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ దీక్షలో ఖాజావలి, జనా ర్ధన్, సుధీర్, కోటేశ్వరరావు, వాసుదేవరావు, ప్రసాద్, మురళి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు రాష్ట్ర మంత్రులతో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆత్మీయ భేటీ

కోవూరు,మార్చి 24 ప్రభాతవార్త రాష్ట్ర దేవాదా యశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, మంత్రి కొల్లు రవీంద్ర, మారిటైమ్ ఛైర్మెన్ దామంచర్ల సత్య, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, జిల్లాపార్టీ అధ్యక్ష లు, బీద రవిచంద్ర, దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, పాశంసునీల్ కుమార్, నెలవల విజయశ్రీ, శాసనమండలి సభ్యులు రాంగోపాల్ రెడ్డి, బల్లి కళ్యాణ చక్రవర్తి తదితరులతో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆత్మీయ భేటీ అయ్యా రు. నెల్లూరు మాగుంట లేఔట్ లోని విపిఆర్ నివాసంలో ఆత్మీయ విందు అనంతరం వివిధ అంశాలపై వారు చర్చించారు. పార్టీ బలోపేతం ఇతర అంశాలపై మాట్లాడారు.

దివ్యాంగ శక్తి పథకం ఎంతో ఉపయోగకరం

కోవూరు, మార్చి 24 ప్రభాతవార్త : దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో దివ్యాంగులకు ప్రతి నెల 6 వేలు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వ ర్లురెడ్డి అన్నారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మా ట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నా దివ్యాంగులకు ఆర్థికంగా మరింత వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రవేశపె ట్టారన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 12.76 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ, ఎక్స్‌ప్రెస్ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ వంటి ఐదు రకాల బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణం చేయ వచ్చన్నారు. వంద శాతం కళ్లు కనిపించని వారు శారీరక, మానసిక వైకల్యం 69 శాతంపైగా ఉన్నవారికి, వారి వెంట వచ్చే సహాయకునికి చార్జీలో 50 శాతం రాయితీ ఇస్తారన్నారు. దివ్యాంగులు ఇటువంటి మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటువంటి మంచి పథకాన్ని ప్రవేశపెట్టిన ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ పథకం కింద అర్హత కలిగిన దివ్యాంగులకు రాష్ట్రంలో అన్ని ఆర్టీసీ డిపోల్లో బస్సు పాసులు కూడా ఇస్తున్నారన్నారు.

న్యాయమైన కోర్కెలను అంగీకరించాలి

కోవూరు, మార్చి 24 ప్రభాతవార్త : కోవూరు తా లూకా పరిధిలోని జేవీసీ ఆధ్వర్యంలో ఆంధ్రప్ర దేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల విద్యావనరుల కేం ద్రం ప్రాంగణంలో రిలే నిరాహార దీక్ష కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సబ్ ట్రెజరీ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేస్తున్న ఈ రిలే నిరాహార దీక్షకు తాము పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. రాష్ట్ర నాయకత్వం కూడా దీనిపై పూర్తిస్థాయిలో ప్రణాళికలు తీసుకుం టుం దని,దాని ప్రకారం రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింతఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, కోవూరు తాలూకా అధ్యక్షుడు కోటేష్, యూటీఎఫ్ నాయకులు హాజరయ్యారు.

ప్రజా సేవకుడు పెంచలన్న : ఎమ్మెల్యే

బుచ్చి మార్చి 24 ప్రభాతవార్త జొన్నవాడ పంచాయితీ సర్పంచ్ కందికట్టు పెంచలన్న నిజమైన నాయ కుడని,ప్రజా సేవకుడని కో వూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రశంసించారు. జొన్నవాడ గ్రామ సభ లో సర్పంచ్ కందికట్టు పెంచలయ్యను ఆ మె శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఒకసారి ఎంపిటిసి సభ్యులుగా,మరోసారి గ్రామ సర్పంచ్‌గా ప్రజల అభిమానంతో ఎన్నికైయ్యాడని ఆమె అభినందించారు. గత ప్రభుత్వం హాయంలో ఆయ న గ్రామానికి ఏమి చెయ్యలేకపోయినా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతు కోటి 11 లక్ష లో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేశారని అన్నారు. మనం ప్రజలకు సేవ చేస్తు ఆరు గుర్తు పెట్టుకొని ఉంటారని ఆమె స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో టిడిపినాయకులు,అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ స్వయంగా వెళ్ళి పన్నులు వసూళ్ళ నోటీసులు పంపిణీ

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 24 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ మొండి బకాయిదారుల నుంచి పన్నులు వసూలు చేసేందుకు స్వయంగా మంగళవారం బకాయి దారు లను కలుసుకొని పన్నులవసూళ్లను చేపట్టారు. లెక్చ రర్స్ కాలనీకి సంబంధించి ఆస్తిపన్ను మొండి బకా యి వసూలు కోసం దాని యజమానిని స్థానిక ఎస్ 2 థియోటర్ ప్రాంతంలోని లక్ష్మీ స్కాన్ సెంటర్‌లో కమిషనర్ కలుసుకొని గత ఐదుఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న బకాయిని చెల్లించాలని కోరారు. స్పందించిన యజమాని బకాయిగా ఉన్న రూ.8,77,827లు చెల్లిం చారు. నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పన్నులు చెల్లించి సహకరించాలని ఈ సందర్భంగా కమిష నర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రగునాథరావు, రెవెన్యూ ఇన్సె పెక్టర్ రవి, వార్డు సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతి ప్రాజెక్ట్ కింద ఏపీ కి కేటాయించిన నిధులెన్ని

లోక్ సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్న

నెల్లూరు రూరల్,మార్చి24 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ, వెనుకబడిన, అభివృద్ధి చెందని ప్రాంతాలపై ప్రత్యేక దృ ష్టి సారించే ప్రక్రియ లో భాగంగా చేపట్టిన ఉన్నతి ప్రాజెక్ట్ కింద ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని నిధులు కేటాయించారో తెలియజేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్ట్ కింద నైపు ణ్యాభివృద్ధి అవకాశాలను అందించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, ఆంధ్రప్ర దేశ్‌లో షెడ్యూల్డ్ కులాలు, ఓబీసీలు, మైనారిటీలు ఇతర అణగారిన వర్గాలతో సహా ఇతర వర్గాల యువతకు ఇందులో కల్పిస్తున్న ప్రాధాన్యత, ఉన్నతి ప్రాజెక్ట్ ప్రయోజనాలపై అవగాహన కల్పించే చర్యలు వంటి అంశాలపై వివరాలు కోరా రు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. "ఉన్నతి" ప్రాజెక్ట్ అనేది కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 2019లో ప్రారంభించిన ఒక కేంద్ర పథకమని, స్వయం ఉపాధి లేదా వేతన ఉపాధి కోసం ఒక నైపుణ్యాన్ని అందించడం ద్వారా మహాత్మా గాంధీ ఎన్ఆర్ఈజీఏ కార్మికుల జీవనోపాధిని మెరుగుపరచడం దీనిలక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం కింద, 201819 ఆర్థిక సంవత్సరం నుండి ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పనిని పూర్తి చేసిన ప్రతి కుటుంబం నుండి ఒక వయోజన సభ్యుడు (1845 సంవత్సరాల వయస్సు) శిక్షణకు అర్హులనీ, అటు వంటి కుటుంబాల నుండి శిక్షణ కోసం వ్యక్తులను ఎంపిక చేసే ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, సంచార జాతులు, నోటిపై చేయని తెగలు, పేదరిక రేఖకు దిగువన ఉన్న ఇతర కుటుంబాలు, మహిళా గృహయజమానులు, శారీరకంగా వికలాంగులైన గృహ పెద్దలు, భూ సంస్కరణల లబ్ధిదారులు, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద లబ్ధిదారులు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం, 2006 కింద లబ్ధిదారులకు వరుసగా ప్రాధా న్యత ఉంటుందన్నారు. ఎంపిక అయిన కుటుంబానికి సామాజిక ఆర్థిక కుల గణన (SECC) వెనుకబాటు ప్రమాణాల ఆధారంగా ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 20202021 ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్ట్ ఉన్నతి కింద భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ..7.64 కోట్లు విడుదల చేసిందన్నారు. గత ఐదేళ్లలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (DDU-GK) కింద ..1108.24 కోట్లు (కేంద్ర ప్రభుత్వ వాటా 60 ..664.94 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 ..443.30 కోట్లు) కేటాయించబడ్డాయని చెప్పా రు. ఉన్నతి ప్రాజెక్ట్ గ్రా మీణ నైపుణ్యాలవిభాగం, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (DDU-GK) గ్రామీణ స్వ యం ఉపాధి శిక్షణా సంస్థల (RSETI) సమన్వయంతో అమలు చేస్తున్న నేపథ్యం లో రాష్ట్రాలు /కేంద్రపాలిత ప్రాంతాలు ఈ కార్యక్రమాల అవగాహన, బ్రాండింగ్ వ్యూహాలను అనుసరి స్తాయన్నారు. అర్హులను గుర్తించే బాధ్యత ప్రోగ్రామ్ అధికారులపై ఉంటుందని వివరించారు.

ఉమ్రా యాత్రికిలకు వీడ్కోలు

నెల్లూరు, మార్చి 24, ప్రభాతవార్త-విద్య : ముస్లిం లకు ఎంతో పవిత్రమైన ఉమ్రాకు వెలుతున్న నెల్లూ రుకు చెందిన 70మంది ప్రయాణీకులకు మదీనా వా చ్స్ ఏజన్సీ అధినేత, తెలుగుదేశం నేత ఇంతియాజ్ వీ డ్కోలు పలికారు. అల్ అమీన్‌ఉమ్రా ట్రావెల్స్ ఆధ్వ ర్యంలో ఉమ్రాకు వెలుతున్న ప్రయాణీకుల వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం స్థానికబారాషాహీద్ దర్గా లో నిర్వహించారు. ఇంతియాజ్ మాట్లాడుతు ప్రయా ణీకులు అందరూ ఎటువంటి ఆట కాలు కలుగకుండా యాత్ర పూర్తిచేసుకుని క్షేమంగా నగరానికి తిరిగి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రావెల్స్ నిర్వాహకులు జంషీద్, తదితులు పాల్గొన్నారు.

ఆకాల వర్షానికి దెబ్బతిన్న రైతులకు న్యాయం చేస్తాం

రాపూరు, మార్చి 24, ప్రభాతవార్త రాపూరు మం డలంలో రెండు రోజుల క్రితం కురిసిన ఆకాల వర్షా నికి పంట దెబ్బతిన్న రైతులను వెంకటగిరి నియోజ కవర్గం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సహకారంతో ఆదుకోవడం జరుగుతుందని పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డిలు తెలిపారు. ఇటీవల కురిసిన ఆకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, పొగాకు, మామిడి నిమ్మ పంటలను మంగళవారం వారు వ్యవసాయాధికారులతో కలసి గోనుపల్లి గ్రామంలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గోనుపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 200 ఎకరాలో పరిపంట పూర్తిగా దెబ్బతినగా, పొగాకు పంట వెసిన రైతు పూర్తిగా నష్టపోయారన్నారు. వీరితో పాటు ఉద్యానవన పంటలైన నిమ్మ, మామిడి చెట్లు కూడా పూర్తిగా పూత, పిందే రాలిపోయి రైతుకు తీవ్ర నష్టం చేకురిం దన్నారు. ఈ విషయాలను వ్యవసాయాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎంత మేరకు పంట నష్టం జరిగింది అన్న విషయాలను నివేదికల రూపంతో ఆందజేయాలని వారు ఇచ్చిన నివేదికలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సహకారంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకోని వెళ్లి పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. వీరి వెంట నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, డాక్టర్ వంకిపోలు వంశీధర్ రెడ్డి, అకలివలస సర్పంచ్ చెన్ను పెంచల రెడ్డి, గడ్డం సంజీవ రెడ్డి, పలువురు రైతులు, మండల వ్యవసాయాధికారి సోమసుందరం, తదితరులున్నారు.

ఏపూరు వద్ద 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

..టాస్క్ ఫోర్స్ ఆదుపులో ఇద్దరు నిందితులు

రాపూరు, మార్చి 24, ప్రభాతవార్త మండలంలోని ఏపూరు గ్రామ హరిజనవాడ వద్ద మంగళవారం రైల్వే కోడూరు టాస్క్‌ఫోర్స్ వారు అక్రమ రవాణాకు సిద్ధంగా వున్న 13 ఎర్రచందనం దుంగలను పట్టుకోని, ఇద్దరు నిందుతులను ఆదుపులోకి తీసుకున్నారు. ఎఆర్ఎస్ఐ చెన్నయ్య తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి ఈ 13 ఎర్రచందనం దుంగలు పట్టుకోవడంతో పాటు సైదాదుపల్లి గ్రామానికి చెందిన గుంజి రమేష్, అంకయ్య అనే నిందితులను పట్టుకున్నట్లు సమాచారం, ఇందుకు సంబందించి మరిన్ని వివరాలు తెలియాల్సి వుంది.

అక్రమ వేట నిరోధంపై మత్స్యకారులకు భరోసా కల్పించాలి

- సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 24, ప్రభాతవార్త నిఘా బోట్లకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త బోట్లు కొనుగోలు చేయాలని, కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమో హన్ రెడ్డి ప్రస్తావించారు. డీప్ సీ బోట్ల కొనుగోలుకు మహిళ లకు 60 శాతం సబ్సిడీ అమలు పరచాలని నేలటూరు పిషింగ్ జెట్టీ నిర్మా ణం పూర్తి చేయడంతో పాటు పులికాట్‌లో సముద్ర ముఖద్వా రాల పూడికతీతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సముద్రంలో నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి అని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బోట్లను రిపేరు చేయించాలని, కొత్త బోట్లు కొనుగోలు చేయా లని పులికాట్ సరస్సుకు సంబంధించి సముద్ర ము ఖ ద్వారాల పూడిక, నేలటూరు ఫిషింగ్ జెట్టీ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయించాల్సిన బాధ్యత ఏపీ మారిటైం బోర్డుపై ఉందని రూ.300 నుంచి రూ.400 కోట్లు ఖర్చు పెడితే మత్స్యకారుల ప్రధాన సమస్యలన్నీ పరిష్కారమవుతాయని, ఈ నిధుల కోసం అందరం వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి విజ్ఞప్తి చేద్దాం అన్నారు. కృష్ణపట్నంలోని కోస్ట్ గార్డు సేవలను ఏ విధంగా వినియోగించుకోవాలో కూడా ఆలోచించాలన్నారు. మెరైన్ విభాగంలో కానిస్టేబు ల్ పోస్టులన్నీ భర్తీ చేయాలన్నారు. అవసరమైతే అద నపు పోస్టులు కూడా కేటాయించాలి రూ.1.20 కోట్ల విలువైన డీసీ బోటుకు మహిళలకు ఇస్తున్న సబ్సిడీ 40శాతమే ఉండటంతో కొనుగోలుకు ఎవరూ ముందు కు రావడం లేదు 60 శాతం సబ్సిడీ ఇస్తే ఈ బోట్లపై మత్స్యకారులు ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఆ అదనపు 20 శాతం సబ్సిడీని సీఎస్ఆర్ నిధులద్వారా అయినా సమకూర్చేందుకు ప్రయత్నిస్తామని, మత్స్య కారులకు ఒక భరోసా కల్పించాల్సిన బాధ్యత మనంద రిపై ఉందని ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలియజేశారు.

బట్టువారిపాళెంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా అబివృద్ధి పనులు ప్రారంభోత్సవం



కలిగిరి, మార్చి24, ప్రభాతవార్త: కలిగిరి మండ లం బట్టువారి పాళెంలో ఉదయగిరి శాసన సభ్యు లు కాకర్ల సురేష్ పలు అబివృద్ధి పనుల ప్రా రంభోత్సవాలు గావించారు .గంగిరెడ్డిపాళెం; బ ట్టువారిపాళెం మధ్యన కనెక్టివిటి బ్రిడ్జి ప్రాం భోత్సవం విలేజి హెల్త్ క్లీనిక్ రైతుసేవాకేంద్రం ప్రారంభోత్సవం గంగిరెడ్డిపాలెం బ్రిడ్జి ప్రారం భోత్సవన గావించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రు. 1కోటి 90 లక్షలో గంగిరెడ్డిపాళెం ప్రజల ప్రజలకు ప్ర యోజనం చేకూర్చే పనులు చేయడం జరిగింద న్నారు.మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతోనే ఈ కార్యక్రమాలు చేయగలిగామన్నారు. పార్టీ మండల కన్వినర్ పూసాల వెంగప నాయుడు,అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కీ.శే.చెన్ను బాలకృష్ణా రెడ్డి 3వ వర్ధంతి

రాపూరు, మార్చి 24, ప్రభాతవార్త దివంగత రాపూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు స్వర్గీయ చెన్ను బాలకృష్ణా రెడ్డి 3వ వర్ధంతిని మంగళవారం తానంచర్ల గ్రామంలోని చెన్ను గార్డెన్స్‌లో ఆయన కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ, జిల్లా సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, డిసియంఎస్ ఛైర్మన్ గంగోడి నాగేశ్వర రావు,ఆనం రంగమయూర్ రెడ్డి, వైసిపి జిల్లా నాయకుడు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, పెద్ద ఎత్తున నాయకులు హాజరై చెన్ను బాలకృష్ణా రెడ్డి చిత్రపఠానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాపూరు మండలంలో తిరుగులేని నేతగా, దాతగా ఎంతో మంది నిరుద్యోగులకు ప్రభుత్వ, ప్రవేటు ఉపాధి అవకాశాలు చూపిన మహా నేత చెన్ను బాలకృష్ణా రెడ్డి అని కోనియాడారు. మండలంలో ఎంతో మంద